- aruhi group
www.mahaaprabha.com

# నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

గురువారం
19-11-2026

సంపుటి : 01 సంచిక 235 పేజీలు : 08 వెల : ₹5/-

తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.

Published From RANGAREDDY TELANGANA.RNI NO : TGTEL/26/A0738 VOLUME 01 ISSUE 235 NAMASTEY MAHAAPRABHA



Mr. NAKKA RAJU
Chairman of Mahaaprabha



గత ఆంధ్ర పాలకుల కంటేరేవంత్ వల్లే

## తెలంగాణకు ఎక్కువ నష్టం:

- కృష్ణా జలాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారు
- నాగార్జునసాగర్ నుంచి 90 టీఎంసీల నీటిని మళ్లించేందుకు ఏపీ ప్రయత్నిస్తోంది
- ఈ వ్యవహారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరోక్ష సహకారం
- జల్ జీవన్ మిషన్ పేరుతో ఏపీ నీటి వినియోగానికి కేంద్రం మద్దతు
- మోదీ, చంద్రబాబు, రేవంత్ వ్యవహారశైలిపై కేటీఆర్ విమర్శలు
- సాగర్ వద్ద ఏడాదిగా జరుగుతున్న పనులు ప్రభుత్వానికి తెలియవా?
- నీటి మళ్లింపును అడ్డుకునేందుకు ఏం చర్యలు తీసుకున్నారు?
- మిగిలిన 40 టీఎంసీల కోసం కేఆర్ఎంబీకి వెంటనే లేఖ రాయాలి

హైదరాబాద్: నవంబర్ 18 మహాప్రభ

గత ఆంధ్ర పాలకుల కంటే రేవంత్‌రెడ్డి వల్లే తెలంగాణకు ఎక్కువ నష్టం జరుగుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. కృష్ణా జలాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలను దెబ్బతీసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి దాదాపు 90 టీఎంసీల కృష్ణా నది నీటిని మళ్లించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, ఈ వ్యవహారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరోక్ష సహకారం ఉందని అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ, ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహారశైలి వల్ల తెలంగాణ ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలుగుతోందని కేటీఆర్ మండిపడ్డారు.

-మిగతా 3 లో

# సిద్ధిపేటకు నేడు సీఎం

## ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం



03

- రూ.544.11 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం
- రూ.451.13 కోట్ల పనులకు శంకుస్థాపనలు
- రూ.92.98 కోట్లతో పూర్తయిన పనుల ప్రారంభోత్సవాలు
- దుబ్బాక, సిద్ధిపేటలో యంగ్ ఇండియా పాఠశాలలకు శంకుస్థాపన
- రెండు నియోజకవర్గాల్లో రూ.200 కోట్ల చొప్పున నిర్మాణం
- సభా వేదికపై ప్రత్యేక ర్యాంప్ ఏర్పాటు
- పర్యటనకు భారీ పోలీసు బందోబస్తు

సిద్ధిపేట జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేడు పర్యటించనున్నారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించడంతోపాటు, రూ.544.11 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. రూ.451.13 కోట్ల పనులకు శంకుస్థాపనలు, రూ.92.98 కోట్లతో పూర్తయిన పనులను ప్రారంభించనున్నారు. దుబ్బాక, సిద్ధిపేట నియోజకవర్గాల్లో రూ.200 కోట్ల చొప్పున నిర్మించనున్న యంగ్ ఇండియా సమీకృత నివాస పాఠశాలలకు శంకుస్థాపన చేయనున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో సభా ప్రాంగణం, హెలిప్యాడ్ పరిసరాల్లో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేయగా, భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



03

## కాశ్మీర్‌లో ఎన్‌కౌంటర్

- లష్కరే కమాండర్ హతం
- కుల్గామ్‌లో భద్రతా బలగాల కాల్పుల్లో లతీఫ్ భట్ మృతి
- మసీదులో తలదాచుకున్న ఉగ్రవాదిని లొంగిపోవాలని హెచ్చరిక
- వీడియో కాల్ ద్వారా కూడా లొంగుబాటుకు పోలీసుల ప్రయత్నం
- కాల్పులు జరపడంతో ఎదురుకాల్పులు..
- తప్పించుకునే అవకాశం లేకుండా చర్యలు



03

## నేడు ట్రంప్, పుతిన్, జిన్‌పింగ్ భేటీ

- ప్రపంచ దేశాల్లో ఉత్కంఠ
- షెన్‌జెన్‌లో అపెక్ సదస్సు వేదికగా భేటీ
- వాణిజ్య వివాదాలు, సుంకాలపై ట్రంప్--జిన్‌పింగ్ చర్చలు
- అణ్వాయుధ నియంత్రణ, అంతర్జాతీయ భద్రతపై ప్రధానంగా చర్చ
- ఇరాన్ యుద్ధం, ఉక్రెయిన్ అంశాలపైనా చర్చించే అవకాశం

## భారత్‌లో తగ్గనున్న హిందూ జనాభా

- 2070 నాటికి పెరగనున్న ముస్లింల జనాభా శాతం
- 2020--2070 మధ్య హిందువుల సంఖ్యలో 17.6 కోట్ల పెరుగుదల
- భారత్‌లో 75 శాతానికి పైగా హిందువులే ఉంటారని అంచనా
- ప్రపంచ జనాభాలో హిందువుల వాటా 15 నుంచి 14 శాతానికి తగ్గుదల

అమెరికాలో పెరగనున్న హిందూ జనాభా



03

# నిధులు ఇవ్వకుంటే కురుక్షేత్రమే



### కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి హెచ్చరిక!

- కాంగ్రెస్ ప్రభుత్వంలో నిధుల పంపకాలపై రాజగోపాల్ రెడ్డి తీవ్ర అసంతృప్తి
- కొడంగల్, మధిర, హుజూర్‌నగర్‌లకే పెద్దపీట వేస్తున్నారని విమర్శ
- కొడంగల్‌కు రూ. 10 వేల కోట్లు కేటాయించారన్న మునుగోడు ఎమ్మెల్యే
- ఫ్లోరైడ్ పీడిత మునుగోడుకు రూ.500 కోట్లు కూడా ఇవ్వకపోవడం అన్యాయమని ధ్వజం
- సీఎం వాడే భాష సరికాదంటూ మండిపాటు

03

కాంగ్రెస్ ప్రభుత్వంలో నియోజకవర్గాల అభివృద్ధి, నిధుల కేటాయింపుల్లో పక్షపాతం కొనసాగుతోందంటూ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సొంత ప్రభుత్వంపైనే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కొడంగల్‌కు రూ.10 వేల కోట్లు కేటాయిస్తున్న ప్రభుత్వం.. ఫ్లోరైడ్ పీడిత మునుగోడుకు రూ.500 కోట్లు కూడా ఇవ్వకపోవడం అన్యాయమని మండిపడ్డారు. డిండి ఎత్తిపోతల పథకం పనులు, చౌటుప్పల్ వంద పడకల ఆసుపత్రి హామీపై నిలదీస్తూ, నిధుల కేటాయింపులో న్యాయం చేయకపోతే ప్రభుత్వంతో కురుక్షేత్రం తప్పదని హెచ్చరించారు. ముఖ్యమంత్రి మాట్లాడుతున్న భాష కూడా సరికాదని విమర్శించారు.



03

## టెస్టు సమరానికి వేళాయె!

- న్యూజిలాండ్‌తో తొలి టెస్టుకు టీమిండియా సిద్ధం
- గత పరాజయానికి బదులు తీర్చుకోవాలని భారత్ పట్టుదల
- ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ బెర్తుపై గురి
- పచ్చిక పిచ్‌పై పేసర్లకు అనుకూల పరిస్థితులు
- తుది జట్టు కూర్పుపై కొనసాగుతున్న ఉత్కంఠ
- 58 ఏళ్ల తర్వాత వెల్లింగ్టన్‌లో విజయం సాధించేనా?
- ఆతిథ్య జట్టుకు సొంతగడ్డపై మెరుగైన రికార్డు
- వేకువజామున 3.30 గంటల నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రసారం



## విస్తరణకు తెలంగాణే కేంద్రం!

- ముంబైలోనే ప్రధాన కార్యాలయం కొనసాగించండి
- తయారీ, వ్యాపార కార్యకలాపాలను తెలంగాణలో విస్తరించండి
- పారిశ్రామికవేత్తలకు మంత్రి శ్రీధర్‌బాబు పిలుపు
- పెట్టుబడులను తరలించుకురావడం మా ఉద్దేశం కాదు
- సాంకేతికత, ఔషధ, వస్త్ర పరిశ్రమల్లో అపార అవకాశాలు
- డేటా కేంద్రాలు, జీసీసీల ఏర్పాటుకు అనుకూల వాతావరణం
- వేగంగా అనుమతులిచ్చే టీజీ--ఐపాస్ విధానం
- డిసెంబరు 7 నుంచి 9 వరకు పెట్టుబడుల సదస్సు

తెలంగాణ బ్యూరో:నవంబర్ 18 మహాప్రభ

ముంబైలోనే మీ ప్రధాన కార్యాలయాలను కొనసాగించండి.. తయారీ, వ్యాపార విస్తరణ, అభివృద్ధి కార్యకలాపాలను తెలంగాణలో చేపట్టండి అని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. ముంబైలోని వర్లీలో ఫోర్ సీజన్స్ హోటల్‌లో బుధవారం భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) సహకారంతో తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్--2026' రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. తయారీ, సాంకేతికత, ఆవిష్కరణలు, వ్యాపార విస్తరణకు తెలంగాణను గమ్యస్థానంగా ఎంచుకోవాలని కోరారు. ముంబై నుంచి పెట్టుబడులను తరలించుకురావాలన్నది తమ ఉద్దేశం కాదని శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. అక్కడి సంస్థలు తమ ప్రధాన కార్యాలయాలను యథాతథంగా కొనసాగిస్తూనే తెలంగాణలో ఉత్పత్తి, వ్యాపార

-మిగతా 3 లో

# బర్డ్ ఫ్లూ నివారణకు స్వదేశీ టీకా!




- హెచ్5ఎన్1 వైరస్‌ను అడ్డుకునేలా టీకా రూపకల్పన
- ఈ నెల 20న ఆవిష్కరించనున్న కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్
- దేశంలో తొలిసారిగా స్వదేశీ పరిజ్ఞానంతో తయారీ
- పౌల్ట్రీ రైతులకు భారీ నష్టాల నుంచి ఉపశమనం
- కోళ్లు, ఇతర పక్షుల మరణాలను అరికట్టే అవకాశం
- గుడ్లు, కోడిమాంసం ధరల పెరుగుదలకు కళ్లెం పడేనా?
- 2006 బర్డ్ ఫ్లూతో రూ.3 వేల కోట్ల నష్టం

03

భోపాల్‌లోని ఐసీఏఆర్ శాస్త్రవేత్తల ఘనత

# ఏఐతో శాశ్వత నిరుద్యోగం.. ఎవరికీ ఉద్యోగాలు ఉండవు

-2027 నాటికి సూపర్ హ్యూమన్ ఏఐ
-ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఆధారపడాల్సి రావొచ్చు
-ఆంత్రోపిక్ పరిశోధకుడు టావోలిన్ అంచనా




**న్యూఢిల్లీ, నవంబర్ 18 మహాప్రభ**

రాబోయే కొన్ని ఏండ్లలో మానవుల స్థానాన్ని కృత్రిమ మేధ భర్తీ చేస్తుందా? ఇక మనుషులు ప్రభుత్వ పథకాలపై ఆధారపడి జీవనం సాగించాల్సిందేనా? అంటే అవునని అంటున్నారు ప్రముఖ ఏఐ సంస్థ ఆంత్రోపిక్ పరిశోధకుడు టావో లిన్. పాలిసేడ్ రిసెర్చ్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 2027 చివరి నాటికి దాదాపు అన్ని రంగాల్లో అత్యుత్తమ మానవ నిపుణుల సామర్థ్యాన్ని మించే ఏఐ వ్యవస్థలు అందుబాటులోకి రావచ్చని ఆయన అంచనా వేశారు. ఆ తర్వాత క్రమంగా ప్రపంచమంతటా మనుషులకు ఉద్యోగాలు దొరకని పరిస్థితి ఏర్పడుతుందని, మనిషి మనుగడకు ప్రభుత్వాలే దిక్కని అభిప్రాయపడ్డారు.మరో 1.3 ఏండ్లలో లేదా 2027 చివరి నాటికి 'బ్రాడ్లీ సూపర్‌హ్యూమన్ ఏఐ' అందుబాటులోకి రావచ్చునని చెప్పారు. అంటే ప్రతి రంగంలో అత్యుత్తమ నిపుణులతో సమానంగా లేదా అంతకంటే మెరుగ్గా పనిచేయగల వ్యవస్థలు ఏర్పడుతాయని వివరించారు. మనుషులు చేసే పనులను యంత్రాలే నిర్వహిస్తాయని పేర్కొన్నారు. ఉద్యోగాలు కోల్పోయిన వారు ఇతర రంగాలకు మారాల్సి రావచ్చని, అయితే కొంతకాలం తర్వాత అక్కడ కూడా ఏఐ పోటీని తట్టుకోలేని పరిస్థితి ఏర్పడతుందని అన్నారు. చివరకు ప్రపంచంలోని అందరూ శాశ్వతంగా నిరుద్యోగులుగా మారుతారని అభిప్రాయపడ్డారు.

# బీహార్‌లో రూ.40 కోట్ల బంగారం చోరీ



**పాట్నా, నవంబర్ 18 మహాప్రభ**

బీహార్‌లోని పశ్చిమ చంపారన్ జిల్లా బెత్తియాలో సెంకో జ్యువెలర్స్ షోరూంలో భారీ దోపిడీ జరిగింది. మూడు బైక్‌లపై వచ్చిన 8 మంది నిందితులు ఆయుధాలతో బెదిరించారు. సెల్‌ఫోన్లను లాక్కుని అందరి చేతులు కట్టేసి ఒక చోటకు చేర్చారు. షోరూంలోని నగలను ఎత్తుకెళ్లారు. వెళ్తూ వెళ్తూ 'మేం మళ్లీ వస్తాం.. ఇదో సినిమా' అని నిందితులు పేర్కొన్నారు. అపహరించిన నగల విలువ రూ.40 కోట్ల వరకు ఉంటుందని ప్రాథమిక అంచనా.

# భారత్‌లోనూ సేల్స్‌ఫోర్స్ లేఆఫ్స్




**న్యూఢిల్లీ నవంబర్ 18 మహాప్రభ**

మరికొందరు ఉద్యోగులను తొలగించాలని సేల్స్‌ఫోర్స్ తీసుకున్న నిర్ణయం ప్రభావం భారతీయ ఉద్యోగులపై కూడా పడినట్లు కనిపిస్తున్నది. సేల్స్‌ఫోర్స్ ఇండియాలో పనిచేస్తున్నట్టు చెప్పుకున్న ఉద్యోగి ఇచ్చిన పోస్ట్‌లో, తనను సమీక్ష కోసం పిలిచి, సమావేశం అనంతరం ఉద్యోగుల తొలగింపు గురించి చెప్పారని తెలిపారు.వనిష్కమ్రణ ప్యాకేజీలో సుమారు రెండు నెలల గార్డెన్ లీవ్‌తోపాటు సర్వీసు కాలం, ప్రాంతం ఆధారంగా అదనపు వారాల వేతనం ఉండవచ్చని సమాచారం.అటు ఇంటెల్‌లో మరోసారి ప్రపంచవ్యాప్తంగా లేఆఫ్స్ ఉండనున్నాయి.ఈ వారం పలువురు ఉద్యోగులను తీసేశారు.

# యెమెన్‌పై సౌదీ భారీ వైమానిక దాడులు



**దుబాయ్ నవంబర్ 18 మహాప్రభ**

సౌదీ అరేబియా నేతృత్వంలోని కూటమి బుధవారం యెమెన్‌లో హౌతీల ఆధీనంలో ఉన్న ప్రాంతాలపై భారీ వైమానిక దాడులు చేసింది. ఈ దాడిలో కనీసం 17 మంది మరణించగా, పలువురు గాయపడినట్టు హౌతీలు తెలిపారు. రాజధాని సనా, అమ్రాన్, సాదా, హొడైదా ప్రావిన్స్‌లలో జరిపిన దాడుల్లో 60 సైనిక లక్ష్యాలను ధ్వంసం చేసినట్టు కూటమి ప్రతినిధి మేజర్ జనరల్ టర్కీ అల్-మాల్కీ చెప్పారు.

# పౌరసత్వం రాకముందే సోనియాకు ఓటు..

-రిపోర్టు కోరిన ఢిల్లీ కోర్టు



**న్యూఢిల్లీ:నవంబర్ 18 మహాప్రభ**

కాంగ్రెస్ నేత సోనియా గాంధీ కి భారతీయ పౌరసత్వం రాకముందే ఓటరు జాబితాలో ఆమె పేరు ఉన్నట్లు ఫిర్యాదు నమోదు అయ్యింది. ఆ కేసులో రిపోర్టు సమర్పించాని పోలీసులను ఢిల్లీ కోర్టు కోరింది. వికాశ్ త్రిపాఠి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా మెజిస్ట్రేట్ కోర్టు ఆ ఆదేశాలు జారీ చేసింది. రౌజ్ అవెన్యూ కోర్టులోని జుడిషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ వినోద్ జోషీ ఈ ఆదేశాలు ఇచ్చారు. సోనియా గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని వికాశ్ తన పిటీషన్‌లో కోరాడు. అయితే ఈ అంశంపై నవంబర్ 28వ తేదీన కోర్టు విచారణ చేపట్టనున్నది.2025 సెప్టెంబర్ 11న వికాశ్ ఇచ్చిన ఫిర్యాదును అదనపు చీఫ్ జుడిషియల్ మెజిస్ట్రేట్ వైభవ్ చౌరాసియా డిస్మిస్ చేశారు. అయితే ఆ ఆదేశాలను సవాల్ చేస్తూ త్రిపాఠి సెషన్స్ కోర్టులో రివిజన్ పిటీషన్ దాఖలు చేశారు. న్యూఢిల్లీ నియోజవకర్గంలో 1980లోనే ఎన్నికల జాబితాలో సోనియా గాంధీ పేరు ఉన్నట్లు త్రిపాఠి ఆరోపించారు. కానీ భారతీయ పౌరసత్వం ఆమె కు ఏప్రిల్1983లో కల్పించినట్లు పేర్కొన్నారు.1980 ఎన్నికల జాబితాలో సోనియా గాంధీ పేరు ఉన్నా.. ఆ తర్వాత 1982లో ఆ పేరును డిలీట్ చేశారన్నారు . మళ్లీ 1983లో సోనియా పేరును ఓటర్ల లిస్టులో చేర్చినట్లు చెప్పారు.

# నదిలో పడిన ఆర్మీ వాహనం..

-ఆర్మీ కెప్టెన్ మృతి, ముగ్గురు సిబ్బందికి గాయాలు



**ఇంఫాల్:నవంబర్ 18 మహాప్రభ**

ఒక ఆర్మీ వాహనం నదిలో పడింది. ఆ వాహనంలో ఉన్న ఆర్మీ కెప్టెన్ ఈ ప్రమాదంలో మరణించారు. మరో ముగ్గురు సిబ్బంది గాయపడ్డారు. వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ముగ్గురు సిబ్బంది పరిస్థితి కూడా విషయంగా ఉన్నట్లు తెలుస్తున్నది. (ఖాతీఎఎ ఝుజ్ఝుఅఅ ఎఅశ్రీశ్రీవఎ) మణిపూర్‌లోని ఇంఫాల్ తూర్పు జిల్లాలో ఈ సంఘటన జరిగింది. బుధవారం మధ్యాహ్నం 8వ బీహార్ రెజిమెంట్‌కు చెందిన ఆర్మీ సిబ్బంది ఒక వాహనంలో ప్రయాణించారు. లామ్లాయ్ చల్లౌ వద్ద ఆ వాహనం అదుపుతప్పింది. ఇటమ్ నదిలోకి దూసుకెళ్లింది.కాగా, ఈ సమాచారం తెలిసిన వెంటనే పోలీసులు, రెస్క్యూ సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. నదిలో పడిన ఆర్మీ సిబ్బందిని బయటకు తీశారు. గాయపడిన వారిని బాబినా ఆసుపత్రికి తరలించారు. అయితే 29 ఏళ్ల ఆర్మీ కెప్టెన్ హనుమాన్ రామ్ చికిత్స పొందుతూ మరణించారు. మిగతా ముగ్గురు సిబ్బంది అయిన 24 ఏళ్ల సిపాయి మాలి జయేష్ హిమ్మత్, 37 ఏళ్ల సిపాయి రాకేష్ సర్పటే, 19 ఏళ్ల అగ్నివీర్ అఖిలేష్ కుమార్ షా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఆర్మీ అధికారులు తెలిపారు. వీరి పరిస్థితి కూడా విషయంగా ఉన్నట్లు వివరించారు. ఈ ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# ఆర్థిక సంక్షోభ అంచుల్లో భారత్.. తీవ్ర స్థాయిలో నిరుద్యోగం: రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ: నవంబర్ 18 మహాప్రభ**

భారత్ తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కోబోతున్నట్లు రాహుల్ గాంధీ తెలిపారు. దేశంలో నిరుద్యోగం కూడా అధికంగా ఉన్నట్లు చెప్పారు. ఉత్పత్తి వ్యవస్థ దెబ్బతిన్నదని, విద్యా వ్యవస్థలో అనేక సమస్యలు ఉన్నాయని విపక్ష నేత రాహుల్ అన్నారు. ప్రస్తుతం ఉన్న ఆర్థిక దిశలోనే కొనసాగితే.. దేశంలో తీవ్ర సమస్యలు ఉత్పన్నం అవుతాయని అన్నారు. అమెరికాలోని కొలంబియా యూనివర్సిటీలో ఆయన మీడియాతో మాట్లాడారు. భారతీయ ఆర్థిక మోడల్ గత దశాబ్దం నుంచి ఫలితాలు ఇవ్వడం ఆపేసిందన్నారు. మేకిన్ ఇండియా, స్టార్టప్ ఇండియా లాంటి ప్రభుత్వ స్కీమ్‌లను రాహుల్ తప్పుట్టారు. దెబ్బతిన్న ఆర్థిక వెన్నుముకను ఆ పథకాలు కాపాడలేకపోయాయన్నారు.ఆర్థిక సంక్షోభం అంచుల్లో భారత్ ఉందని, అదే వాస్తవం అని, మీడియా కానీ, ఎవరైనా కానీ ఆ అంశాన్ని పక్కన పెట్టారని, కానీ ఇండియాలో నిరుద్యోగం భీకర స్థాయిలో ఉందన్నారు. భారతీయ విద్యా వ్యవస్థతోనూ సమ్యలు ఉన్నట్లు చెప్పారు. మంగళవారం న్యూయార్క్ చేరుకున్న రాహుల్ గాంధీ.. కొలంబియా వర్సిటీలోని వందల సంఖ్యలో ఉన్న విద్యార్థులను, ఫ్యాకల్టీ సభ్యులను ఉద్దేశించి మాట్లాడారు. చిన్న, మధ్యతరహా వ్యాపారులే భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నుముక అని, ఉద్యోగ కల్పనలో, వ్యవసాయానికి ఆధారమని, ఇండియాలో ఇదే మూలం అని, కానీ ఆర్థిక వ్యవస్థ వెన్నువిరిచారని రాహుల్ అన్నారు. దేశంలో ప్రైవేటు పెట్టుబడులు తగ్గిపోయాయని ఆరోపించారు. కేవలం అదానీ, అంబానీ పెట్టుబడులు ఉన్నాయన్నారు. ఉత్పత్తి వ్యవస్థ లేకుండా సక్సెస్ కాలేమన్నారు. భారత్‌లో చోటుచేసుకున్న విద్యార్థుల నిరసన ప్రదర్శన గురించి చెబుతూ ఆ నిరసనలు అప్పుడే పుట్టినవికావన్నారు. పదేళ్లుగా జరుగుతున్న రాజకీయ, ఆర్థిక అణిచివేత వల్ల విద్యార్థులు ఉద్యమించినట్లు చెప్పారు. సంపద, అధికారం కేంద్రీకృతం కావడం వల్ల ఆదివాసీలు, దళితులు, రైతులు తీవ్ర ప్రభావానికి లోనైనట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయని, దీనిలో భాగంగానే సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తప్పించాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల వ్యవస్థను సుస్థిరం చేయాలని, లేదంటే ఏమీ జరగబోదన్నారు. అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాలపై స్పందిస్తూ.. పెరిగిన ఇంధన ధరల ప్రభావం వల్లే రిపబ్లికన్ పార్టీ ఓడిందన్నారు.




# ట్రంప్ హత్యకు కుట్ర పన్నిన వ్యక్తికి 27 ఏండ్ల జైలు



**వాషింగ్టన్ :నవంబర్ 18 మహాప్రభ**

డొనాల్డ్ ట్రంప్‌ను హత్య చేసేందుకు కుట్ర పన్నిన పాకిస్థాన్ పౌరుడు ఆసిఫ్ మర్చంట్ ఆసిఫ్‌కు 27 ఏండ్ల ఆరు నెలల జైలు శిక్ష పడింది. న్యూయార్క్‌లోని బ్రూక్లిన్ ఫెడరల్ కోర్టు ఈ తీర్పు చెప్పింది.ఆసిఫ్ ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జీసీ) ట్రంప్, ఇతర అమెరికన్ నేతల హత్య చేసే పనిని తనకు అప్పగించినట్టు ఆసిఫ్ వాంగ్మూలం ఇచ్చాడు.

# నెతన్యాహుకు పార్లమెంట్‌లో ఎదురుదెబ్బ



**ఇజ్రాయెల్ నవంబర్ 18 మహాప్రభ**

ఇజ్రాయెల్ తాత్కాలిక ప్రధాని నెతన్యాహుకు పార్లమెంట్‌లో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆయన ప్రత్యర్థి, మాజీ సైనికాధికారి గాడి ఐసెన్‌కోట్‌కు మద్దతుదారుడైన మతన్ కహానా పార్లమెంట్ స్పీకర్‌గా ఎన్నికయ్యారు.మొత్తం 120 మంది సభ్యులకు గానూ 66 మంది ఆయనకు మద్దతివ్వగా, నెతన్యాహు లికుడ్ పార్టీ అభ్యర్థి ఒఫిర్ కాట్జ్‌కు 52 ఓట్లు వచ్చాయి. దీంతో నెతన్యాహు విధానాలను అడ్డుకునే అవకాశం ఐసెన్‌కోట్ వర్గానికి లభించింది.

# హ్యాట్రిక్‌తో రికార్డులు బద్దలు కొడుతాం: యూపీ సీఎం



**లక్నో: నవంబర్ 18 మహాప్రభ**

మూడోసారి బీజేపీ అధికారంలోకి వస్తుందని ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఈ సారి తమ పార్టీ రికార్డులు బద్దలుకొడుతుందని ఆయన అన్నారు. తమ కూటమి రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో 320 సీట్లు సాధిస్తాయని అన్నారు. రైజింగ్ భారత్ సమ్మిట్‌లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఫలితాలపై అనుమానాలు అవసరం లేదన్నారు. గతంలో నమోదు చేసిన రికార్డుల కన్నా ఈసారి మెరుగ్గా ప్రదర్శిస్తామని తెలిపారు. 320 మార్క్ దాటుతుందా అని ఓ రిపోర్టర్ అడిగిన ప్రశ్నకు ఆయన బదులిస్తూ కచ్చితంగా ఆ దిశలోనే తమ పార్టీ పనిచేస్తోందన్నారు.సమాజ్‌వాదీ, కాంగ్రెస్ పార్టీలను సీఎం యోగి టార్గెట్ చేశారు. గత ప్రభుత్వాలు, ప్రస్తుత పాలనను బేరేజీ వేసుకోవాలన్నారు. గత ప్రభుత్వాలను జంగిల్ రాజ్, గుండారాజ్ అనేవారని, ఆ సమయంలో కర్ఫ్యూలు, లూటీలు జరిగేవని సీఎం యోగి ఆరోపించారు. బీజేపీ మరోసారి పూర్తి మెజారిటీ సాధించి హ్యాట్రిక్ కొడుతుందన్నారు. కుటుంబం, కులం ఆధారిత రాజకీయాలతో ఉత్తరప్రదేశ్‌ను గత ప్రభుత్వాలు భ్రష్టుపట్టించాయని ఆరోపించారు. రాష్ట్రాన్ని చిక్కట్లోకి నెట్టేశారన్నారు.

# మళ్లీ భగ్గుమంటున్న బంగ్లాదేశ్



**ఢాకా :నవంబర్ 18 మహాప్రభ**

పదవీచ్యుతురాలైన మాజీ ప్రధాని షేక్ హసీనా దేశానికి వస్తారని ప్రచారం జరుగుతున్న క్రమంలో బంగ్లాదేశ్‌లో తిరిగి ఉద్రిక్త పరిస్థితి ఏర్పడి పలు హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి.గత కొన్ని రోజులుగా అక్కడ నిరసనలు, ఘర్షణలు, బాంబు పేలుళ్లు, దహన దాడులు జరిగాయి. వీటికి హసీనా పార్టీకి చెందిన నిషేధిత అవామీ లీగ్ పార్టీ మద్దతుదారులే కారణమంటూ పోలీసులు అరోపిస్తున్నారు.

## గత ఆంధ్ర పాలకుల కంటేరేవంత్ వల్లే తెలంగాణకు ఎక్కువ నష్టం:

(మొదటి తరువాయి)

జల్ జీవన్ మిషన్ పేరుతో ఏపీ చేపడుతున్న నీటి వినియోగానికి కేంద్ర ప్రభుత్వం సహకరిస్తోందని విమర్శించారు. తెలంగాణ సాగునీటి, తాగునీటి ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని పేర్కొన్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు వద్ద గత ఏడాది కాలంగా పనులు జరుగుతుంటే తెలంగాణ ప్రభుత్వానికి తెలియదా? అని కేటీఆర్ ప్రశ్నించారు. ఏపీ నీటి మళ్లింపు ప్రయత్నాలను అడ్డుకునేందుకు ఇప్పటివరకు ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై కృష్ణా నదీ యాజమాన్య బోర్డుకు అధికారికంగా ఫిర్యాదు చేశారా? లేదా? అన్నది స్పష్టం చేయాలని నిలదీశారు. తెలంగాణ తాగునీటి అవసరాల కోసం మిగిలి ఉన్న 40 టీఎంసీల నీటి కేటాయింపులను కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కేఆర్ఎంబీకి లేఖ రాయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా తక్షణమే స్పందించాలని కోరారు.

## భారత్‌లో తగ్గనున్న హిందూ జనాభా

- 2070 నాటికి పెరగనున్న ముస్లింల జనాభా శాతం
- 2020--2070 మధ్య హిందువుల సంఖ్యలో 17.6 కోట్ల పెరుగుదల
- భారత్‌లో 75 శాతానికి పైగా హిందువులే ఉంటారని అంచనా
- ప్రపంచ జనాభాలో హిందువుల వాటా 15 నుంచి 14 శాతానికి తగ్గుదల
- అమెరికాలో పెరగనున్న హిందూ జనాభా



న్యూఢిల్లీ, నవంబర్ 18

రానున్న ఐదు దశాబ్దాల్లో భారత్‌లో హిందువుల జనాభా వాటా స్వల్పంగా తగ్గే అవకాశం ఉందని ప్యూ పరిశోధనా కేంద్రం తాజా అధ్యయనం అంచనా వేసింది. 2020 నుంచి 2070 మధ్య దేశంలో హిందువుల సంఖ్య 17.6 కోట్ల మేర పెరిగే అవకాశమున్నప్పటికీ, మొత్తం జనాభాలో వారి వాటాలో మార్పులు చోటుచేసుకోవచ్చని పేర్కొంది. 2070 నాటికి భారత్‌లో హిందువుల జనాభా 75 శాతానికి పైగా ఉంటుందని అంచనా వేసింది. ఇదే సమయంలో ముస్లింల జనాభా వాటా పెరిగే అవకాశం ఉందని తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా హిందువుల సంఖ్య కూడా పెరుగుతుందని అధ్యయనం వెల్లడించింది. 2020తో పోలిస్తే 2070 నాటికి ప్రపంచవ్యాప్తంగా హిందువుల సంఖ్య 19.9 కోట్ల మేర పెరిగి 140 కోట్లకు చేరవచ్చని పేర్కొంది. అయితే ప్రపంచ జనాభాలో హిందువుల వాటా మాత్రం 15 శాతం నుంచి 14 శాతానికి తగ్గవచ్చని అంచనా వేసింది. ఇక అమెరికాలో హిందువుల జనాభా గణనీయంగా పెరిగే అవకాశముందని ప్యూ పరిశోధనా కేంద్రం తెలిపింది. 2070 నాటికి అమెరికా ప్రపంచంలో ఐదో అతిపెద్ద హిందూ జనాభా కలిగిన దేశంగా అవతరించవచ్చని పేర్కొంది. ఆస్ట్రేలియా కూడా హిందువుల జనాభా అధికంగా ఉన్న తొలి పది దేశాల జాబితాలో చోటు సంపాదించవచ్చని అంచనా వేసింది.

## కాశ్మీర్‌లో ఎన్‌కౌంటర్..

-లష్కరే కమాండర్ హతం
- కుల్గామ్‌లో భద్రతా బలగాల కాల్పుల్లో లతీఫ్ భట్ మృతి
- మసీదులో తలదాచుకున్న ఉగ్రవాదిని లొంగిపోవాలని హెచ్చరిక
- వీడియో కాల్ ద్వారా కూడా లొంగుబాటుకు పోలీసుల ప్రయత్నం
- కాల్పులు జరపడంతో ఎదురుకాల్పులు..
-తప్పించుకునే అవకాశం లేకుండా చర్యలు



శ్రీనగర్

జమ్ముకశ్మీర్‌లోని కుల్గామ్ జిల్లాలో బుధవారం జరిగిన ఎదురుకాల్పుల్లో లష్కరే తొయిబా ఉగ్రవాద సంస్థకు చెందిన కీలక కమాండర్ లతీఫ్ భట్ హతమయ్యాడు. కశ్మీర్ లోయలో మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదుల్లో ఒకడిగా ఉన్న భట్ స్థానిక మసీదులో దాక్కున్నట్లు భద్రతా బలగాలకు సమాచారం అందింది. దీంతో ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టిన బలగాలు అతడిని లొంగిపోవాలని పలుమార్లు హెచ్చరించాయి. సీనియర్ పోలీసు అధికారులు వీడియో కాల్ ద్వారా కూడా లొంగుబాటుకు ప్రయత్నించినట్లు సమాచారం. అయినప్పటికీ భట్ అంగీకరించకుండా బలగాలపై కాల్పులు జరపడంతో ఎదురుకాల్పులు ప్రారంభమయ్యాయి. ఈ ఘటనలో అతడు హతమైనట్లు అధికారులు వెల్లడించారు. భట్ దాక్కున్న మసీదు పక్కనే ఉన్న దారుల్ ఉలూమ్ పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు, 25 మంది బాలికలు ఉన్నారు. ఎన్‌కౌంటర్ చర్యలు ప్రారంభించడానికి ముందే భద్రతా బలగాలు వారందరినీ సురక్షిత ప్రాంతాలకు తరలించాయి. దీంతో ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. కాగా, కుల్గామ్ జిల్లా ఆక్రాన్‌లో ఈ నెల 11న సీఆర్‌పీఎఫ్ చెక్‌పోస్టుపై జరిగిన దాడిలోనూ లతీఫ్ భట్ ప్రమేయం ఉన్నట్లు భద్రతా వర్గాలు తెలిపాయి. ఆ ఘటనలో ముగ్గురు సీఆర్‌పీఎఫ్ సిబ్బంది గాయపడ్డారు. భట్‌తో కలిసి పనిచేసిన మరో ఉగ్రవాది ఉమర్ నిసార్ దార్ సోమవారం కుల్గామ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హతమైనట్లు సమాచారం. ఆ సమయంలో భట్ తప్పించుకోగా, అతడి కోసం గాలింపు కొనసాగించిన భద్రతా బలగాలు బుధవారం అతడి ఆచూకీ గుర్తించి ఈ ఆపరేషన్ చేపట్టాయి.

## నేడు ట్రంప్, పుతిన్, జిన్‌పింగ్ భేటీ

షెన్‌జన్

ప్రపంచ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకోబోతున్నది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్ నవంబర్ 19న తొలిసారిగా త్రైపాక్షిక సమావేశంలో పాల్గొననున్నారు. షెన్‌జెన్‌లో జరుగుతున్న అపెక్ సదస్సు దీనికి వేదిక కానుంది. ఇప్పటికే జిన్‌పింగ్, పుతిన్ సమావేశమై, తమ దేశాల సంబంధాలను పాత మిత్రుల బంధంగా అభివర్ణించారు. అంతర్జాతీయ అనిశ్చితి వేళ ఈ బంధం స్థిరత్వానికి దోహదపడుతుందని జిన్‌పింగ్ పేర్కొన్నారు. ట్రంప్, జిన్‌పింగ్ భేటీలో వాణిజ్య వివాదాలు, సుంకాలు, అమెరికా వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లు, అరుదైన ఖనిజాల సరఫరా, ఏఐ చిప్‌లపై ఆంక్షలు చర్చకు రానున్నాయి. ముగ్గురి సమావేశంలో అణ్వాయుధాల నియంత్రణ, ఇరాన్ యుద్ధం, అంతర్జాతీయ భద్రతపై చర్చించనున్నారు. ఉక్రెయిన్ యుద్ధం చర్చకు వస్తుందా లేదా అనేదానిపై స్పష్టత లేదు.

ట్రంప్‌నకు జిన్‌పింగ్ ఆలింగనం!

అపెక్ సదస్సుకు హాజరయ్యేందుకు బుధవారం చైనాలోని షెంజెన్‌కు వచ్చిన ట్రంప్‌కు ఘన స్వాగతం లభించింది. విమానాశ్రయంలో ట్రంప్‌నకు జిన్‌పింగ్ స్వయంగా స్వాగతం పలికారు. ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు.

# సిద్ధిపేటకు నేడు సీఎం

-ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం
- రూ.544.11 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం
- రూ.451.13 కోట్ల పనులకు శంకుస్థాపనలు
- రూ.92.98 కోట్లతో పూర్తయిన పనుల ప్రారంభోత్సవాలు
- దుబ్బాక, సిద్ధిపేటలో యంగ్ ఇండియా పాఠశాలలకు శంకుస్థాపన
- రెండు నియోజకవర్గాల్లో రూ.200 కోట్ల చొప్పున నిర్మాణం
- సభా వేదికపై ప్రత్యేక ర్యాంప్ ఏర్పాటు
- పర్యటనకు భారీ పోలీసు బందోబస్తు



సిద్ధిపేట,

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం సిద్ధిపేట జిల్లాలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించనున్నారు. జిల్లాలో మొత్తం రూ.544.11 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఇందులో రూ.451.13 కోట్ల పనులకు శంకుస్థాపనలు చేయడంతోపాటు, రూ.92.98 కోట్లతో పూర్తిచేసిన పనులను ప్రారంభించనున్నారు. దుబ్బాక, సిద్ధిపేట నియోజకవర్గాల్లో ఒక్కో చోట రూ.200 కోట్ల వ్యయంతో నిర్మించనున్న యంగ్ ఇండియా సమీకృత నివాస పాఠశాలలకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. సిద్ధిపేట కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు ప్రత్యేక హెలికాప్టర్‌లో ముఖ్యమంత్రి చేరుకోనున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల చౌరస్తాలోని ఇందిరాగాంధీ విగ్రహం వద్దకు వెళ్లి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నారు. అనంతరం పట్టణ శివారులోని చిన్నగుండవెల్లి రోడ్డులో ఏర్పాటు చేసిన బహిరంగ సభా ప్రాంగణానికి చేరుకుంటారు. సభా వేదికపై నుంచి ప్రజలకు అభివాదం చేసేందుకు సుమారు 200 మీటర్ల పొడవున ప్రత్యేక ర్యాంప్‌ను ఏర్పాటు చేశారు. పర్యటనలో భాగంగా రోడ్డు మార్గం, సభా ప్రాంగణం, హెలిప్యాడ్ పరిసరాల్లో భారీ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. వేలాది మంది పోలీసు సిబ్బందిని బందోబస్తు విధుల్లో నియమించారు. పోలీసు కమిషనర్ రష్మీ పెరుమాళ్ భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. బుధవారం మంత్రులు వివేక్ వెంకటస్వామి, దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్ సభా ఏర్పాట్లను పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లలో భాగంగా అధికారులు హెలికాప్టర్ ప్రయోగాత్మక పరీక్ష నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల చౌరస్తా నుంచి సభా ప్రాంగణం వరకు పోలీసులు వాహనాలతో పాటు పాదయాత్ర నిర్వహించి ఏర్పాట్లను తనిఖీ చేశారు. సీఎం పర్యటన సజావుగా సాగేందుకు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారు.

## విస్తరణకు తెలంగాణే కేంద్రం!

(మొదటి తరువాయి)

కార్యకలాపాలను విస్తరించుకునేందుకు అనువైన వాతావరణాన్ని కల్పించడమే తమ లక్ష్యమని వివరించారు. రెండు ప్రాంతాల మధ్య దశాబ్దాలుగా వాణిజ్య, వ్యాపార సంబంధాలు కొనసాగుతున్నాయని చెప్పారు. తెలంగాణకు చెందిన కార్మికులు, చేతివృత్తులవారు, వ్యాపారవేత్తలు ముంబై అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారని మంత్రి గుర్తుచేశారు. శతాబ్దం క్రితం తెలంగాణ ప్రజలు ముంబై భవిష్యత్తు నిర్మాణంలో భాగస్వాములయ్యేందుకు ఇక్కడికి వచ్చారని, ఇప్పుడు తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. సాంకేతిక రంగం, గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు (జీసీసీలు), డేటా కేంద్రాలు, ఔషధ పరిశ్రమలు, వస్త్రాలు, దుస్తుల తయారీ, మీడియా, వినోద రంగాల్లో తెలంగాణలో విస్తృత అవకాశాలున్నాయని శ్రీధర్‌బాబు వివరించారు. పెట్టుబడులకు వేగంగా అనుమతులు మంజూరు చేసే టీజీ--ఐపాస్ విధానం గురించి తెలియజేశారు. డిసెంబరు 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్--2026'లో పాల్గొనాలని పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సీఐఐ మహారాష్ట్ర రాష్ట్ర మండలి ఉపాధ్యక్షురాలు ఆర్తి కూచిభట్ల తెలంగాణ ప్రతినిధి బృందానికి స్వాగతం పలికారు. తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ వైస్ చైర్మన్, ఎండీ శశాంక, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈవో బి.అజిత్‌రెడ్డి, పరిశ్రమలు, వాణిజ్య శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి పాల్గొన్నారు.

## బర్డ్ ఫ్లూ నివారణకు స్వదేశీ టీకా!

హైదరాబాద్, నవంబర్ 18:

పౌల్ట్రీ పరిశ్రమను తీవ్రంగా ప్రభావితం చేస్తున్న బర్డ్ ఫ్లూ నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం స్వదేశీ టీకాను అందుబాటులోకి తీసుకొస్తున్నది. ఈ వైరస్ నుంచి కోళ్లను రక్షించేందుకు దేశీయ పరిజ్ఞానంతో రూపొందించిన తొలి టీకాను ఈ నెల 20న ఆవిష్కరించనున్నారు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్ కేంద్రంగా పనిచేస్తున్న భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) పరిధిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హై సెక్యూరిటీ యానిమల్ డిసీజెస్ శాస్త్రవేత్తలు దీనిని అభివృద్ధి చేశారు. కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ భోపాల్‌లో ఈ టీకాను ఆవిష్కరించనున్నారు. ఐసీఏఆర్ అభివృద్ధి చేసిన ఈ టీకా ఇన్‌యాక్టివేటెడ్ హెచ్5ఎన్1 (క్లేడ్ 2.3.2.1ఏ) హైలీ పాథోజెనిక్ ఏవియన్ ఇన్‌ఫ్లుయెంజా వైరస్‌ను లక్ష్యంగా చేసుకొని రూపొందించారు. ఇప్పటివరకు దేశంలో కోళ్లకు సోకుతున్న బర్డ్ ఫ్లూ కేసుల్లో అత్యధికం ఈ వైరస్ రకానికి చెందినవే. అంతర్జాతీయంగా కూడా ఈ వైరస్ రకాన్ని అడ్డుకునేందుకు ప్రత్యేకమైన టీకా అందుబాటులో లేకపోవడంతో ఐసీఏఆర్ శాస్త్రవేత్తలు స్వదేశీ టీకాను అభివృద్ధి చేశారు.

## నిధులు ఇవ్వకుంటే కురుక్షేత్రమే..

-కాంగ్రెస్ ప్రభుత్వంలో నిధుల పంపకాలపై రాజగోపాల్ రెడ్డి తీవ్ర అసంతృప్తి
-కొడంగల్, మధిర, హుజూర్‌నగర్‌లకే పెద్దపీట వేస్తున్నారని విమర్శ
-కొడంగల్‌కు రూ. 10 వేల కోట్లు కేటాయించారన్న మునుగోడు ఎమ్మెల్యే
-ఫ్లోరైడ్ పీడిత మునుగోడుకు రూ.500 కోట్లు కూడా ఇవ్వకపోవడం అన్యాయమని ధ్వజం
-సీఎం వాడే భాష సరికాదంటూ మండిపాటు



హైదరాబాద్,

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సొంత పార్టీ సర్కారుపైనే తీవ్ర అసంతృప్తి స్వరం వినిపిస్తూ కాంగ్రెస్‌లో మరోసారి ప్రకంపనలకు తెరలేపారు. నియోజకవర్గాల అభివృద్ధి, నిధుల మంజూరులో ముఖ్యమంత్రి, మంత్రులు తీవ్రమైన పక్షపాతం చూపుతున్నారంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. సమస్యలను పరిష్కరించి రావలసిన వాటా నిధులు కేటాయించకపోతే రాబోయే రోజుల్లో సర్కారుతో 'కురుక్షేత్రం' తప్పదని తేల్చిచెప్పారు. మునుగోడులో బుధవారం జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, పాలన తీరుపై ఘాటు విమర్శలు గుప్పించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ కేవలం సిరిసిల్ల, సిద్దిపేట, గజ్వేల్ ప్రాంతాలకే నిధులు కుమ్మరించారని రాజ్‌గోపాల్ రెడ్డి ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలోనూ అదే తరహా సంస్కృతి కొనసాగుతుందని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి తన కొడంగల్‌పై, ఉత్తమ్ కుమార్ రెడ్డి హుజూర్‌నగర్‌పై, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మధిరపై మాత్రమే ప్రత్యేక దృష్టి పెడుతున్నారని ఆరోపించారు. కొడంగల్ అభివృద్ధి కోసం రూ.10 వేల కోట్లు తీసుకెళ్తున్న ప్రభుత్వం.. ఫ్లోరైడ్ బారినపడి ఏళ్ల తరబడి అల్లాడుతున్న మునుగోడు ప్రజల కోసం చెరువులు, కుంటలను బాగుచేసేందుకు రూ.500 కోట్లు కూడా ఇవ్వకపోవడం దారుణమన్నారు. డిండి ఎత్తిపోతల పథకం పనులు మూడేళ్లుగా పడకేయడంతో నల్గొండ ప్రజల ప్రయోజనాలను బలిపెడుతున్నారని రాజ్‌గోపాల్ పేర్కొన్నారు. చౌటుప్పల్ 100 పడకల ఆసుపత్రి హామీ ఇప్పటికీ అటకెక్కి ఉందని మండిపడ్డారు. పార్టీ అంతర్గత సమావేశాల్లో వినతిపత్రాలు సమర్పిస్తే బుట్టదాఖలు చేస్తున్నారన్నారు. అదే ప్రజల ముందు ప్రశ్నిస్తే క్రమశిక్షణ చర్యల పేరిట నోరు నొక్కేందుకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొడంగల్‌కు కేటాయించే నిధులపై నిలదీస్తే 'పండబెట్టి తొక్కుతా' అంటూ మాట్లాడటం ఒక ముఖ్యమంత్రికి తగదని హితవు పలికారు. మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో ప్రజా సమస్యలు పరిష్కారం కావడం లేదని, ప్రజలకు జవాబు చెప్పాల్సిన బాధ్యత సర్కారుపై ఉందని తేల్చిచెప్పారు.

# టెస్టు సమరానికి వేళాయె!

- న్యూజిలాండ్‌తో తొలి టెస్టుకు టీమిండియా సిద్ధం
- గత పరాజయానికి బదులు తీర్చుకోవాలని భారత్ పట్టుదల
- ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ బెర్తుపై గురి
- పచ్చిక పిచ్‌పై పేసర్లకు అనుకూల పరిస్థితులు
- తుది జట్టు కూర్పుపై కొనసాగుతున్న ఉత్కంఠ
- 58 ఏళ్ల తర్వాత వెల్లింగ్టన్‌లో విజయం సాధించేనా?
- అతిథ్య జట్టుకు సొంతగడ్డపై మెరుగైన రికార్డు
- వేకువజామున 3.30 గంటల నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రసారం



వెల్లింగ్టన్:

పరిమిత ఓవర్ల క్రికెట్‌లో న్యూజిలాండ్‌పై ఆధిపత్యం ప్రదర్శించిన టీమిండియా.. ఇప్పుడు అసలైన పరీక్షకు సిద్ధమైంది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 2025--27 ఫైనల్ రేసులో కీలకమైన రెండు టెస్టుల సిరీస్‌లో భాగంగా భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య తొలి టెస్టు గురువారం వెల్లింగ్టన్‌లోని బేసిన్ రిజర్వ్ మైదానంలో ప్రారంభం కానుంది. 2024లో స్వదేశంలో కివీస్ చేతిలో ఎదురైన 0--3 పరాజయానికి బదులు తీర్చుకోవడంతో పాటు, పాయింట్ల పట్టికలో మెరుగైన స్థానం సాధించాలనే పట్టుదలతో శుభ్‌మన్ గిల్ సేన బరిలోకి దిగుతోంది. న్యూజిలాండ్ పిచ్‌లపై సీమ్, స్వింగ్ పరిస్థితులు భారత యువ బ్యాటర్లకు కఠిన సవాల్‌గా మారనున్నాయి. అయితే జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్ వంటి అనుభవజ్ఞులైన పేసర్లు జట్టులో ఉండటం భారత్‌కు కలిసొచ్చే అంశం.మరోవైపు టెస్టుల్లో భారత్‌పై మెరుగైన రికార్డు కలిగిన ఆతిథ్య న్యూజిలాండ్ ఈసారి కూడా అదే జోరు కొనసాగించాలని భావిస్తోంది. దీంతో తొలి టెస్టులో ఇరు జట్ల మధ్య హోరాహోరీ పోరు తప్పదనే అంచనాలున్నాయి. గాయం నుంచి కోలుకున్న వికెట్ కీపర్ రిషభ్ పంత్ తిరిగి జట్టులోకి రావడం భారత్‌కు ఊరటనిస్తోంది. పచ్చిక పిచ్ పరిస్థితుల దృష్ట్యా నలుగురు ప్రత్యేక పేసర్లతో బరిలోకి దిగే అవకాశముంది. బుమ్రా, సిరాజ్‌లకు తోడుగా మిగిలిన స్థానాల కోసం ప్రసిద్ధ్ కృష్ణ, ఆకాశ్ దీప్, గుర్నూర్ బ్రార్ పోటీపడుతున్నారు. ఆల్‌రౌండర్ కోటాలో నితీశ్ కుమార్ రెడ్డికి అవకాశం దక్కవచ్చని భావిస్తున్నారు. రవీంద్ర జడేజా స్పిన్ ఆల్‌రౌండర్‌గా తన స్థానాన్ని దాదాపు ఖాయం చేసుకోగా, వాషింగ్టన్ సుందర్ కూడా ఎంపిక రేసులో ఉన్నాడు. బ్యాటర్లలో గిల్, కేఎల్ రాహుల్, పంత్, యశస్వి జైస్వాల్, దేవదత్ పడిక్కల్ స్థానాలు దాదాపు ఖాయంగా కనిపిస్తున్నాయి. మరో స్థానం కోసం ధ్రువ్ జురెల్, సాయి సుదర్శన్ మధ్య పోటీ నెలకొనగా.. జురెల్ ముందున్నట్లు తెలుస్తోంది.బేసిన్ రిజర్వ్ మైదానంలో భారత్‌కు ఆశించిన స్థాయిలో రికార్డు లేదు. ఇక్కడ ఇప్పటివరకు ఎనిమిది టెస్టులు ఆడిన టీమిండియా 1968లో మన్సూర్ అలీ ఖాన్ పటౌడీ సారథ్యంలో ఒక్కసారి మాత్రమే విజయం సాధించింది. ఐదు మ్యాచ్‌ల్లో ఓడిపోగా, రెండింటిని డ్రా చేసుకుంది. 2020లో చివరిసారిగా ఇక్కడ ఆడినప్పుడు పది వికెట్ల తేడాతో పరాజయం పాలైంది. దాదాపు 58 ఏళ్ల తర్వాత ఈ మైదానంలో మరో విజయాన్ని అందుకోవాలని గిల్ సారథ్యంలోని యువ భారత ఉవ్విళ్లూరుతోంది. బేసిన్ రిజర్వ్ పిచ్‌పై సుమారు 15 మిల్లీమీటర్ల మేర దట్టమైన పచ్చిక ఉంది. దీనికి తోడు వెల్లింగ్టన్‌లో బలంగా వీచే గాలులు, మేఘావృతమైన వాతావరణం పేసర్లకు అనుకూలంగా మారనున్నాయి. తొలి రెండు రోజులు బౌలర్లదే పైచేయి కావచ్చని అంచనా. ఆరంభంలో బంతికి అదనపు బౌన్స్, స్వింగ్ లభించే అవకాశం ఉండటంతో భారత బ్యాటర్లకు కఠిన పరీక్ష ఎదురుకానుంది. మూడో రోజు నుంచి పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలించే అవకాశముంది.ప్రస్తుత ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో 72.22 విజయ శాతంతో న్యూజిలాండ్ రెండో స్థానంలో ఉండగా, 51.52 శాతంతో భారత్ నాలుగో స్థానంలో కొనసాగుతోంది. ఫైనల్ రేసులో నిలవాలంటే ఈ సిరీస్‌లో లభించే పాయింట్లు టీమిండియాకు అత్యంత కీలకం. రెండు టెస్టుల్లోనూ మెరుగైన ప్రదర్శనతో విజయాలు సాధించి ఫైనల్ అవకాశాలను బలోపేతం చేసుకోవాలని గిల్ సేన లక్ష్యంగా పెట్టుకుంది.

తుది జట్లు (అంచనా):

భారత్: యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్ (ఉపసారథి), దేవదత్ పడిక్కల్, శుభ్‌మన్ గిల్ (సారథి), రిషభ్ పంత్ (వికెట్ కీపర్), ధ్రువ్ జురెల్, రవీంద్ర జడేజా, నితీశ్ కుమార్ రెడ్డి/ఆకాశ్ దీప్, జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ/గుర్నూర్ బ్రార్.

న్యూజిలాండ్: టామ్ లాథమ్ (సారథి), డెవాన్ కాన్వే, రచిన్ రవీంద్ర, డారిల్ మిచెల్, హెన్రీ నికోల్స్, టామ్ బ్లండెల్ (వికెట్ కీపర్), గ్లెన్ ఫిలిప్స్, మాట్ హెన్రీ, కైల్ జేమీసన్, జాకబ్ డఫీ/బ్లెయిర్ టిక్నర్, నాథన్ స్మిత్.




# బీఆర్ఎస్ గర్జనల జయకేతనం



రాజకీయాల్లో ప్రజల తీర్పు ఒక్కరోజులో రూపుదిద్దుకోదు. ప్రజల ఆలోచనల్లో మార్పు వచ్చినప్పుడు, పాలకులపై అసంతృప్తి పెరిగినప్పుడు, తమకు గతంలో అండగా నిలిచిన నాయకత్వం మళ్లీ కావాలనే ఆకాంక్ష బలపడినప్పుడు రాజకీయ సమీకరణాలు మారడం ప్రారంభమవుతుంది. ప్రస్తుతం తెలంగాణలో రామగుండం, ఆదిలాబాద్, నిర్మల్ వేదికగా బీఆర్ఎస్ నిర్వహించిన భారీ సభలను పరిశీలిస్తే తెలంగాణ రాజకీయాల్లో అలాంటి మార్పు స్పష్టంగా కనిపిస్తున్నది. ఈ సభలకు తరలివచ్చిన జనసందోహం, ప్రజల్లో కనిపించిన ఉత్సాహం, కార్యకర్తల్లో పెరిగిన ఆత్మవిశ్వాసం చూస్తుంటే బీఆర్ఎస్ మళ్లీ అధికార పీఠాన్ని అధిరోహించే దిశగా అడుగులు వేస్తున్నదనే బలమైన సంకేతాలు వెలువడుతున్నాయి. ప్రజల జీవితాల్లో గతంలో చోటుచేసుకున్న మార్పులు, సంక్షేమ పథకాల ద్వారా అందిన ప్రయోజనాలు, అభివృద్ధి కార్యక్రమాల జ్ఞాపకాలు ప్రజల ఆలోచనల్లో నిలిచిపోతాయి. ఇప్పుడు తెలంగాణలో జరుగుతున్న రాజకీయ పరిణామాలు కూడా ఇదే విషయాన్ని గుర్తుచేస్తున్నాయి. గత బీఆర్ఎస్ పాలనను గుర్తుచేసుకుంటున్న ప్రజలు, ప్రస్తుత ప్రభుత్వ హామీల అమలుపై ప్రశ్నలు సంధిస్తున్నారు. ఇటీవలి మూడు గర్జన సభలు విజయవంతం కావడమే ఇందుకు నిదర్శనం. అక్టోబర్ 14న బీఆర్ఎస్ నిర్వహించిన సింగరేణి గర్జన సభకు కార్మికులు, ప్రజలు భారీగా తరలివచ్చారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ సభలో సింగరేణి కార్మికుల సమస్యలు ప్రధాన చర్చనీయాంశంగా మారాయి. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం గర్జించిన గులాబీ జెండా, ఇప్పుడు ప్రజల హక్కుల కోసం, రైతుల సంక్షేమం కోసం, కార్మికుల భద్రత కోసం మరోసారి ప్రజాక్షేత్రంలో గళమెత్తుతున్నది. ఒకప్పుడు తెలంగాణ ఉద్యమంలో ప్రజలను ఏకం చేసిన బీఆర్ఎస్, ఇప్పుడు ప్రజా సమస్యల ఆధారంగా తన రాజకీయ పునాదిని తిరిగి నిర్మించుకుంటున్నది. కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత, సంస్థ భవిష్యత్తు, ప్రైవేటీకరణపై నెలకొన్న ఆందోళనలు, ప్రస్తుత ప్రభుత్వ వైఖరిని కేటీఆర్ ప్రశ్నించారు. సింగరేణి అనేది కేవలం బొగ్గు ఉత్పత్తి సంస్థ కాదు. వేలాది కుటుంబాల జీవనాధారం. తెలంగాణ పారిశ్రామిక, ఆర్థిక వ్యవస్థలో కీలకమైన భాగం. కార్మికుల చెమటతో నిర్మితమైన సంస్థ. అలాంటి సంస్థ భవిష్యత్తుపై ఆందోళనలు వ్యక్తమవుతున్నప్పుడు కార్మికుల పక్షాన ఎవరు నిలబడతారన్నది అత్యంత కీలకం. సింగరేణి గర్జన వేదికగా బీఆర్ఎస్ కార్మికుల సమస్యలను బలంగా ప్రస్తావించడం, దానికి వేలాదిగా కార్మికులు స్పందించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఇక ఆదిలాబాద్‌లో నవంబర్ 1న నిర్వహించిన రైతు గర్జన సభకు అన్నదాతలు, యువకులు భారీగా తరలివచ్చారు. ఈ సభలో కేటీఆర్ రైతుల సమస్యలను ప్రధాన అజెండాగా తీసుకున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు, సాగునీటి సమస్యలు, రైతుబంధు, రైతుబీమా, రైతు కూలీలకు ఇచ్చిన హామీలు, కౌలు రైతుల పరిస్థితి వంటి అంశాలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రైతు తన జీవితంలో అనుభవించిన మార్పును సులభంగా మరచిపోడు. రైతుబంధు, రైతుబీమా, ఉచిత కరెంట్, యూరియా, విత్తనాలు, పంట కొనుగోలు, సాగునీరు వంటి పథకాలను కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసింది. నాటి జ్ఞాపకాలే నేటి రాజకీయ చర్చల్లో ప్రస్తావనకు వస్తున్నాయి. నవంబర్ 11న నిర్మల్‌లో నిర్వహించిన రైతు గర్జన సభ ఈ రాజకీయ పరిణామాలకు మరింత బలాన్ని చేకూర్చింది. కేటీఆర్ రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తూ, ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ, పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నారు. ఈ మూడు సభల్లో కేటీఆర్ ప్రసంగాలు కేవలం ప్రభుత్వ వ్యతిరేక విమర్శలకే పరిమితం కాలేదు. సింగరేణి కార్మికుల భవిష్యత్తు, రైతుల సంక్షేమం, సాగునీటి ప్రాజెక్టుల ప్రయోజనాలు, ప్రజలకు ఇచ్చిన హామీల అమలు వంటి అంశాలను ముందుకు తీసుకొచ్చారు. ప్రజల సమస్యలను రాజకీయ పోరాటానికి కేంద్రంగా మార్చుతున్నారు. ముఖ్యంగా కాంగ్రెస్‌కు, బీజేపీకి ఎమ్మెల్యేలు, ఎంపీలు ఉన్న ప్రాంతాల్లోనే సభలు నిర్వహించి ప్రజల మధ్య బీఆర్ఎస్ ఉనికిని చాటుకోవడం కేటీఆర్ రాజకీయ వ్యూహంలో భాగంగా కనిపిస్తున్నది. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి నాయకత్వం వహించిన కేసీఆర్‌కు రాష్ట్ర రాజకీయాలు, ప్రజల ఆకాంక్షలు, పరిపాలనపై అపారమైన అనుభవం ఉన్నది.

మరోవైపు కేటీఆర్ యువతతో అనుసంధానం, ఆధునిక రాజకీయ ఆలోచన, ప్రజా సమస్యలపై స్పందించే నాయకత్వంతో పార్టీని భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం చేస్తున్నారు. ఈ ఇద్దరి నాయకత్వ సమన్వయం పార్టీ కార్యకర్తల్లో కొత్త ఆశలను కలిగిస్తున్నది. రాష్ట్రంలో కాంగ్రెస్‌ను, కేంద్రంలో బీజేపీని నిలదీస్తూ తెలంగాణ ప్రజల పక్షాన నిలబడుతున్నామనే రాజకీయ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నది. ఒక పార్టీకి ప్రజల్లో ఉన్న ఆదరణ, కార్యకర్తల్లో ఉన్న ఉత్సాహం, ప్రజా సమస్యలపై ఆ పార్టీ చేస్తున్న పోరాటం, ప్రత్యర్థి పార్టీల ప్రాబల్యం ఉన్న చోట్ల కూడా సభలను విజయవంతం చేయగల సామర్థ్యం ఆ పార్టీ రాజకీయ భవిష్యత్తును సూచిస్తాయి. ఈ మూడు సభలు బీఆర్ఎస్‌కు అలాంటి సానుకూల సంకేతాలను అందించాయి.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం గర్జించిన గులాబీ జెండా, ఇప్పుడు ప్రజల హక్కుల కోసం, రైతుల సంక్షేమం కోసం, కార్మికుల భద్రత కోసం మరోసారి ప్రజాక్షేత్రంలో గళమెత్తుతున్నది. ఒకప్పుడు తెలంగాణ ఉద్యమంలో ప్రజలను ఏకం చేసిన బీఆర్ఎస్, ఇప్పుడు ప్రజా సమస్యల ఆధారంగా తన రాజకీయ పునాదిని తిరిగి నిర్మించుకుంటున్నది. ఈ ప్రయాణంలో రామగుండం, ఆదిలాబాద్, నిర్మల్ సభలు కీలక మలుపులుగా నిలిచాయి. ఈ సభల్లో కనిపించిన జనసందోహం, ప్రజల్లో కనిపించిన ఉత్సాహం, కార్యకర్తల్లో పెరిగిన ఆత్మవిశ్వాసం చూస్తుంటే తెలంగాణ రాజకీయాల్లో గులాబీ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని స్పష్టమవుతున్నది. ముఖ్యంగా రైతులు, కార్మికులు కోరుకుంటున్నది తమ కష్టానికి విలువనిచ్చే పాలన. గతంలో తమకు భరోసా కల్పించిన కేసీఆర్ నాయకత్వాన్ని వారు మళ్లీ గుర్తుచేసుకుంటున్నారు. కేటీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ నిర్వహిస్తున్న గర్జన సభలకు లభిస్తున్న స్పందన ఆ ఆకాంక్షకు రాజకీయ రూపాన్ని ఇస్తున్నది.

# అర్హులైన మహిళలకు అండగా మాధవి యుగంధర్ రెడ్డి..

**వితంతు పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ**



**దేవరకద్ర నవంబర్ 18 మహాప్రభ**

దేవరకద్ర: ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని, ముఖ్యంగా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద మహిళలకు పింఛన్లు కొండంత అండగా నిలుస్తాయని చౌదర్‌పల్లి ఒకటో వార్డు కౌన్సిలర్ మాధవి యుగంధర్ రెడ్డి అన్నారు. దేవరకద్ర మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనివాస గార్డెన్‌లో నిర్వహించిన వితంతు పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో కౌన్సిలర్ మాధవి యుగంధర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్హత సాధించిన లబ్ధిదారులకు ఆమె స్వయంగా పింఛన్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులను అభినందిస్తూ, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరినప్పుడే వాటి లక్ష్యం నెరవేరుతుందని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి, పరిష్కారానికి కృషి చేయడమే ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని ఆమె తెలిపారు. పింఛన్ల మంజూరుతో లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తమైంది. తమకు ఆర్థిక భరోసా కల్పించేలా పింఛన్లు అందించడంపై లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు.

# హరిహర పుత్ర సేవా సమితి ఆధ్వర్యంలో నిత్య అన్నదానం..

**బుద్ధానగర్‌లో ప్రత్యేక పూజలతో అన్నదాన కార్యక్రమానికి శ్రీకారం**

**భక్తి భావంతో పాటు సేవా దృక్పథాన్ని పెంపొందించే అన్నదానం**

**కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి హాజరు**



**హైదరాబాద్ నవంబర్ 18 మహాప్రభ**

పీర్జాదిగూడ డివిజన్ పరిధిలోని బుద్ధానగర్ కాలనీ, రోడ్ నంబర్ 3, విద్యుత్ కార్యాలయం పక్కన హరిహర పుత్ర సేవా సమితి ఆధ్వర్యంలో నిత్య అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మొదటి రోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి పాల్గొనగా, భాస్కర్ గురుస్వామి, రమేష్ గురుస్వామి, శంకర్ గురుస్వామి, నరేష్ గురుస్వామి, రాళ్ల ప్రవీణ్ గురుస్వామి తదితరులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు సమాజంలో భక్తి భావాన్ని, మానవత్వాన్ని, సేవా దృక్పథాన్ని పెంపొందిస్తాయని అన్నారు. హరిహర పుత్ర సేవా సమితి చేపట్టిన నిత్య అన్నదాన కార్యక్రమం నిరంతరాయంగా, విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నవీన్ రెడ్డి, పిట్టల మల్లేష్, పైళ్ల ప్రభాకర్ రెడ్డి, కుంభం జలేందర్ రెడ్డి, కవిడ కుమార్‌తో పాటు పలువురు కన్నె స్వాములు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

# బస్వాయిపల్లిలో పింఛన్ల పండుగ.. 24 మందికి చేయూత భరోసా

**-లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి..**

**-కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన సర్పంచ్ శివకుమార్, ఉపసర్పంచ్ గోవర్ధన్ నాయి**



**మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ నవంబర్ 18 మహాప్రభ**

దేవరకద్ర: ఎన్నాళ్లుగానో పింఛన్ కోసం ఎదురుచూస్తున్న అర్హులకు ఎట్టకేలకు చేయూత లభించింది. దేవరకద్ర మండలం బస్వాయిపల్లి గ్రామానికి చెందిన 24 మంది నూతన చేయూత పింఛన్ లబ్ధిదారులకు ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ( జిఎంఆర్ ) మంజూరు పత్రాలను అందజేశారు. అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమం గ్రామంలో ఆనందోత్సాహాల మధ్య సాగింది.ఏళ్లుగా పింఛన్ కోసం ఎదురుచూస్తున్న తమకు మంజూరు పత్రాలు అందడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. తమకు అండగా నిలిచి పింఛన్లు మంజూరయ్యేలా కృషి చేసిన ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శివకుమార్, ఉపసర్పంచ్ గోవర్ధన్ నాయి ప్రత్యేకంగా పాల్గొని కార్యక్రమ నిర్వహణలో కీలకంగా వ్యవహరించారు. గ్రామస్థుల సంక్షేమం, అర్హులకు ప్రభుత్వ పథకాల ఫలాలు అందించడంలో స్థానిక ప్రజాప్రతినిధుల పాత్రను ఈ కార్యక్రమం మరోసారి చాటిచెప్పింది.కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్ రావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి జయసుధ, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విక్రవర్ధన్ రెడ్డి, గ్రామ సీనియర్ నాయకులు జి. ప్రతాప్ రెడ్డి, శ్రీహరి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**నవంబర్ 20 నుంచి డిసెంబర్ 19 వరకు గ్రామపంచాయతీల్లో ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ**



**పెద్దవంగర నవంబర్ 18 (మహాప్రభ)**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పెద్దవంగర తహసీల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకాన్ని నవంబర్ 19న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా నవంబర్ 20 నుంచి డిసెంబర్ 19 వరకు పెద్దవంగర మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు.

## భిక్షాటన చేసి వినూత్నంగా నిరసన చేపట్టిన

# జనరల్ ఆస్పత్రి కాంట్రాక్ట్ కార్మికులు.

**ఆసుపత్రి కార్మికులకు జీతాలు పెంచకపోతే పుట్టగతులు ఉండవు. రమేష్ సిపిఐ నేత**

**వనపర్తి నవంబర్ 18 మహాప్రభ**

ప్రభుత్వ బోధనాస్పత్రులలో, ప్రభుత్వ మెడికల్ కళాశాలలో జిల్లా ఏరియా ఆసుపత్రులలో సామాజిక ఆరోగ్య కేంద్రాలలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషెంట్ కేర్ సూపర్వైజర్ కార్మికులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు పెంచకపోతే పాలకులకు పుట్టగతులు ఉండవని సిపిఐ నేత జి.రమేష్ హెచ్చరించారు. ప్రభుత్వాసుపత్రిలో పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషెంట్ కేర్ సూపర్వైజర్ విభాగాల కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం 26 వేలకు పెంచాలని,ప్రయివేట్ ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేయాలని, కార్పొరేషన్ ద్వారా జీతాలు చెల్లించాలని ప్రతి నెల ఒకటవ తేదీని ప్రభుత్వ హామీ ప్రకారం వేతనాలు అందించాలని, పీఎఫ్ ఈఎస్ఐలు సక్రమంగా చెల్లించాలని, పండగ జాతీయ ఆర్జిత సెలవులు కాంట్రాక్టు కార్మికులకు వర్తింపచేయాలని తదితర డిమాండ్ల సాధనకై గత ఏడు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఆసుపత్రి కార్మికుల ఆందోళనలో భాగంగా బుధవారం వనపర్తి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మరియు ప్రభుత్వ మాత శిశు సంరక్షణ కేంద్రం కాంట్రాక్ట్ పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషెంట్ కేర్ సూపర్వైజర్ కార్మికులు ప్రభుత్వ తీరును నిరసిస్తూ వినూత్నంగా భిక్షాటన చేస్తూ యాచకులుగా మారి ఆందోళన కొనసాగించారు.

ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ:- పారిశుద్ధ్య,సెక్యూరిటీ, పేషంట్ కేర్, సూపర్వైజర్ కాంట్రాక్టు కార్మికుల జీవనం అస్తవ్యస్తంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రోగుల మలమూత్రాలు ఎత్తిపోసే కార్మికుల సంక్షేమం పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు విస్మయం కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే అనేక పర్యాయాలు కార్మికులు తమ జీవితాలు పెంచాలని ఉద్యోగ భద్రత కల్పించాలని దశలవారీగా అనేక పద్ధతుల్లో ఆందోళనలో నిరసనలు, ధర్నాలు,ముట్టడి ప్రజాప్రతినిధులకు విజ్ఞాపన పత్రాలు అందజేసిన నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం చాలా బాధాకరమని అన్నారు. ఆసుపత్రి పారిశుద్ధ్య కార్మికుల సేవలను పొగుడుతున్న ప్రభుత్వం మరోపక్క జీతాలు పెంచకుండా కార్మికుల ఉసురు తీస్తుందని అన్నారు. ప్రభుత్వం తక్షణమే కాలయాపన లేకుండా కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. లేనిచో నిరవధిక సమ్మెకు కూడా సిద్ధమవుతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి యూనియన్ జిల్లా అధ్యక్షులు శ్రీను,నాయకులు నరసింహ, కృష్ణ, దర్గస్వామి, కలవతమ్మ,లక్ష్మి,మధు,భాస్కర్,మోహన్,పవన్,ప్రశాంత్, ముజాయిదిన్,శాంత, ప్రియాంక, బాలకృష్ణ,శ్రీహరి, ఖదీర్, మహేష్, రూపావతి, పార్వతమ్మ, బాలమ్మ,శ్వేత, నవనీత కాంట్రాక్ట్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు, యువతకు విజ్ఞానాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యం

**ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**

**జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఆధునిక రీడింగ్ హాల్ ,ఆడిటోరియం ప్రారంభించిన ఎమ్మెల్యేలు**

**ఉమ్మడి వరంగల్, నవంబర్ 18 మహాప్రభ**

గ్రంథాలయాలు విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు విజ్ఞానాన్ని అందించే విజ్ఞాన కేంద్రాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్‌అన్నారు.హనుమకొండ జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నూతన రీడింగ్ రూమ్,ఆడిటోరియంను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి , హనుమకొండ జిల్లా కలెక్టర్



చాహత్ బాజ్‌పాయ్ , గ్రంథాలయ సంస్థ చైర్మెన్ అజీజ్ ఖాన్ తో కలిసి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ గ్రంథాలయాలు విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు విజ్ఞానాన్ని అందించే విజ్ఞాన కేంద్రాలని పేర్కొన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఆధునిక సదుపాయాలతో కూడిన గ్రంథాలయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. విద్యార్థులు, యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. ప్రజలకు మెరుగైన విద్యా, విజ్ఞాన సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు.
ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకు, కార్యకర్తలు, విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు.

# మంజూరైన పెన్షన్ల లిస్టును ప్రజలకు అందుబాటులో ఉంచండి



**వనపర్తి..నవంబర్ 18 మహా ప్రభ**
వనపర్తి పట్టణ మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ చేయూత పథకం ద్వారా పెన్షన్లు మంజూరైన లబ్ధిదారులకు సంబంధించిన జాబితాను ప్రజలకు ప్రత్యక్షంగా పరిశీలించడానికి వీలుగా బహిరంగ ప్రదేశంలో ప్రదర్శించాల్సిన అవసరం ఉంది. కానీ సంబంధిత మున్సిపల్ అధికారులు లబ్ధిదారుల జాబితాను వార్డు కౌన్సిలర్లకు మాత్రమే అందజేసినట్లు తెలుస్తోంది. సాధారణ ప్రజలు ఈ జాబితా గురించి అడిగినప్పటికీ అందుబాటులో ఉంచడం లేదని, అలాగే మున్సిపాలిటీ కార్యాలయం లేదా సంబంధిత వార్డులలో పబ్లిక్ డెమో ద్వారా కూడా ప్రదర్శించడం లేదని మా సంస్థ దృష్టికి వచ్చింది.
దీని వలన నిజమైన అర్హులైన లబ్ధిదారుల వివరాలు ప్రజలకు తెలియకుండా ఉండటమే కాకుండా, అర్హత లేని వ్యక్తులకు పెన్షన్లు మంజూరయ్యాయా లేదా, అర్హులైన వారికి పెన్షన్లు అందుతున్నాయా లేదా అనే విషయాలను ప్రజలు పరిశీలించే అవకాశం లేకుండా పోతోంది. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత, జవాబుదారీతనం మరియు ప్రజలకు సమాచార లభ్యత ఎంతో అవసరం.
**కావున మా సంస్థ తరపున క్రింది డిమాండ్లను తెలియజేస్తున్నాము:**
వనపర్తి మున్సిపాలిటీ పరిధిలో చేయూత పథకం ద్వారా పెన్షన్లు మంజూరైన లబ్ధిదారుల వార్డుల వారీ జాబితాను ప్రజలకు అందుబాటులో ఉంచాలి. సంబంధిత జాబితాను మున్సిపాలిటీ కార్యాలయం నోటీసు బోర్డులో మరియు సంబంధిత వార్డు స్థాయిలో బహిరంగంగా ప్రదర్శించాలి. ప్రజలకు జాబితాను పరిశీలించే అవకాశం కల్పించకుండా నిర్లక్ష్యం వహిస్తున్న అధికారుల వ్యవహారంపై చర్యలు తీసుకోవాలి.
కావున తక్షణమే స్పందించి, ప్రజలకు లబ్ధిదారుల జాబితాను నిబంధనల ప్రకారం పరిశీలించే అవకాశం కల్పించి, తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము.

## దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రేజాంగ్ లా యుద్ధంలో వీరమరణం పొందిన 114 మంది యాదవ వీర జవాన్లకు నివాళులు




**దేవరకొండ నవంబర్ 18 ( మహాప్రభ )**
దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ భవనం నందు ఈరోజు ఉదయం 12 గంటలకు రేజాంగ్ లా యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్లకు అధ్యక్షుడు ఎన్.వి. టి సభ్యులతో కలిసి పూలమాలలు వేసి నివాళు లర్పించినారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఎన్.వి. టి.మాట్లాడుతూ 1962లో భారత్ చైనా -సరిహద్దులోని జరిగిన యుద్ధంలో ప్రాణాలు అర్పించిన వీర జవాన్లని మరవరాదని, దేశం కోసం దేశ రక్షణ కోసం పోరాడి మరణించిన వారి త్యాగం విలువ కట్టలేదని, ఈ దేశ భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉందని కాబట్టి యువత దేశ రక్షణ కోసం ముందుండాలని ఈ సందర్భంగా వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తాళ్ల శ్రీధర్ గౌడ్, కోశాధికారి కృష్ణ కిషోర్, జక్కుల శ్రీనివాస్ యాదవ్ రిటైర్డ్ ఆర్మీ, ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ జిల్లా కోశాధికారి భాస్కర్, సర్పంచ్ ముంతా మల్లేష్ యాదవ్, నేతాల వెంకటేష్ యాదవ్, నరసింహ యాదవ్, సుజిత్ యాదవ్, బాలరాజు యాదవ్, సాయి చరణ్, శేఖర్, రాజేష్ రఘు క్రీడాకారుల కళాకారులు తదితరులు పాల్గొన్నారు

## బిఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు వడ్డ్డరమేష్ కార్యకర్తలతో టీ తాగుతూ సరదాగా గడిపారు,



**దేవరకొండ నవంబర్ 18( మహాప్రభ)**
నియోజకవర్గం బి ఆర్ ఎస్ నియోజకవర్గం నాయకులు వడిత రమేష్ దేవరకొండ పట్టణంలో ఈరోజు సాయంత్రం 6 గంటలకు మార్కెట్ యార్డులో కార్యకర్తల పిలుపు మేరకు కాసేపు సరదాగా నవ్వుతూ కార్యకర్తలను ఉత్సాహపరస్తు సంతోషంగా రెండు గంటలసేపు గడిపారు వివిధ పార్టీలకు సంబంధించిన కార్యకర్తలు నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఈసారి రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో మీకు ఖచ్చితంగా ఎమ్మెల్యే టికెట్ వస్తుందని ఆశిస్తున్నాం అనగానే రమేష్ మాట్లాడుతూ భగవంతుని దయ వలన పార్టీ టికెట్ నాకు వస్తుందని నమ్మకం ఉంది ఒకవేళ రాని యెడల నేను ఎమ్మెల్యేగా రంగంలో ఉంటానని మీ అందరి సహాయ సహకారాలు నాకు అందించాలని గత 25 సంవత్సరాల నుండి ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎవరికి ఏ ఇబ్బంది వచ్చినా నా వంతు సహాయ సహకారాలు అందిస్తూ వస్తున్నాను కార్యకర్తలే నా బలం అని అన్నారు

## మెదక్ జిల్లా ముదిరాజ్ హక్కుల సాధన సమితి కార్యదర్శిగా వెంకటేష్ నియామకం

**మెదక్ నవంబర్ 18,(మహాప్రభ)**



తెలంగాణ రాష్ట్ర ముదిరాజుల హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు జంగిటి శ్రీనివాస్ ఆదేశాల మేరకు మెదక్ జిల్లాలో కమిటీలు నియమించడం జరిగింది. మెదక్ జిల్లా హక్కుల సాధన సమితి అధ్యక్షులు పిట్ల సాయి బాబా ముదిరాజ్ చేతుల మీదుగా ఎంగలి వెంకటేష్ ముదిరాజునూ సన్మాఫ్ ఎల్లయ్య గారిని మెదక్ జిల్లా హక్కుల సాధన సమితి కార్యదర్శిగా నియామక పత్రం అందుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యారంగంలో ముదిరాజులు అభివృద్ధిలో ముందుకు సాగడానికి కృషి చేస్తానన్నారు . ఈ కార్యక్రమంలో ముదిరాజ్ కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం

**కుటుంబానికి ఆర్థిక భరోసా -- జీవితానికి రక్షణ.**



**వనపర్తి నవంబర్ 18 మహాప్రభ**
ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భరోసా -- ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నవంబర్ 19 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నమోదు ప్రక్రియ ప్రారంభం మదనాపూర్ మండల ప్రత్యేక అధికారి ఎండీ. సిరాజుద్దీన్ అహ్మద్ తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత, సామాజిక భరోసా కల్పించాలనే గొప్ప లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెడుతున్న లిఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంలి ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా నిలవనుంది. ఈ పథకం ద్వారా కుటుంబానికి ప్రధాన జీవనాధారంగా ఉన్న సంపాదనపరుడు అనుకోని పరిస్థితుల్లో మరణించినప్పుడు, ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా రూ.5 లక్షల జీవిత బీమా పరిహారం అందించడం ప్రధాన ఉద్దేశమని మదనాపూర్ మండల ప్రత్యేక అధికారి ఎండీ. సిరాజుద్దీన్ అహ్మద్ తెలిపారు.
**నవంబర్ 19 నుంచి పథకం ప్రారంభం**
దివంగత మాజీ ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకొని 2026 నవంబర్ 19వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం నమోదు కార్యక్రమం ప్రారంభం కానుంది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో అర్హులైన కుటుంబాల వివరాలను సేకరించి నమోదు చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.
**ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా**
ఈ పథకం కింద ప్రతి అర్హ కుటుంబానికి రూ.5,00,000 జీవిత బీమా రక్షణ కల్పించనున్నారు. కుటుంబంలో ప్రధానంగా ఆదాయం సమకూర్చే వ్యక్తికి బీమా వర్తిస్తుంది. ఒక కుటుంబంలో ఒకరే సంపాదించే వ్యక్తి ఉన్నట్లయితే ఆ వ్యక్తిని బీమా కోసం నమోదు చేస్తారు. ఒకరి కంటే ఎక్కువ మంది సంపాదించే వ్యక్తులు ఉన్న కుటుంబాల్లో ఎవరికి బీమా చేయించుకోవాలనేది కుటుంబ సభ్యులే నిర్ణయించుకునే అవకాశం కల్పించారు.
**18 నుంచి 59 సంవత్సరాల వయస్సు వారికి అవకాశం**
కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలిచే 18 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన అర్హులైన వ్యక్తుల వివరాలను నమోదు చేయనున్నారు. వయస్సు నిర్ధారణకు ఆధార్ కార్డులోని పుట్టిన తేదీని ప్రామాణికంగా తీసుకుంటారు. కులం, మతం, ఆదాయం వంటి భేదాలు లేకుండా ప్రతి కుటుంబానికి జీవిత బీమా భద్రత కల్పించాలన్నది ప్రభుత్వ ప్రధాన లక్ష్యం.
**నామినీ ఎంపికకు అవకాశం.**
ఈ పథకంలో బీమా పొందే వ్యక్తి తన కుటుంబ సభ్యుల్లో ఒకరు లేదా అంతకంటే ఎక్కువ మందిని నామినీలుగా ఎంపిక చేసుకోవచ్చు. ఒకరి కంటే ఎక్కువ మంది నామినీలను ఎంపిక చేసుకుంటే, బీమా పరిహారాన్ని ఏ నిష్పత్తిలో అందించాలనే విషయాన్ని కూడా నమోదు చేసుకునే అవకాశం ఉంటుంది. భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బీమా పొందే వ్యక్తి, నామినీల వివరాలను జాగ్రత్తగా పరిశీలించి నమోదు చేయడం అవసరం.
**నమోదు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు**
అర్హులైన కుటుంబాలు నమోదు కార్యక్రమానికి హాజరయ్యే సమయంలో ఆధార్ కార్డు, రేషన్ కార్డు, మొబైల్ నంబర్, కుటుంబ సభ్యుల వివరాలు, నామినీల వివరాలు సిద్ధంగా ఉంచుకోవాలి. నమోదు సమయంలో బీమా పొందే వ్యక్తి పేరు, ఆధార్ వివరాలు, పుట్టిన తేదీ, మొబైల్ నంబర్, నామినీల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలి. అధికారులు నమోదు చేసిన వివరాలను సంబంధిత కుటుంబ సభ్యులకు చదివి వినిపించి, వారి అంగీకారం తీసుకున్న తర్వాతే నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం సూచించింది.
ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలి ఈ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు నవంబర్ 17, 18 తేదీల్లో గ్రామాల్లో దండోరా, మైక్ ప్రచారం, వాట్సాప్ గ్రూపులు, ఇతర ప్రచార మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. గ్రామపంచాయతీ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రతి కుటుంబానికి పథకం వివరాలు చేరేలా కృషి చేయాలి.
**ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి**
కుటుంబంలో సంపాదించే వ్యక్తిని కోల్పోయినప్పుడు ఆ కుటుంబం ఎదుర్కొనే ఆర్థిక ఇబ్బందులను తగ్గించడంలో ఈ పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. కుటుంబ పెద్ద లేదా జీవనాధారమైన వ్యక్తి మరణించిన సందర్భంలో కుటుంబ సభ్యులకు ఆర్థిక భరోసా కల్పించడం ద్వారా వారి జీవన భద్రతకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. కావున మదనాపూర్ మండలంలోని గ్రామీణ ప్రజలందరూ ఈ పథకంపై అవగాహన కలిగి ఉండి, ప్రభుత్వం ఏర్పాటు చేసే ప్రత్యేక నమోదు కేంద్రాలను సంప్రదించి అర్హులైన కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేసుకోవాలని మదనాపూర్ మండల ప్రత్యేక అధికారి ఎండీ. సిరాజుద్దీన్ అహ్మద్ కోరారు.
ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం -- ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా, ప్రతి జీవితానికి రక్షణ.

## గాంధారిలో చేయూత పెన్షన్ పత్రాల పంపిణీ

**117 మందికి పెన్షన్లు మంజూరు: సర్పంచ్ రేణుక సంజీవ్ యాదవ్**



**గాంధారి నవంబర్ 18 (మహాప్రభ)**
గాంధారి మండల కేంద్రంలో బుధవారం రోజున లబ్ధిదారులకు చేయూత పెన్షన్ పత్రాలను గ్రామ సర్పంచ్ రేణుక సంజీవ్ యాదవ్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ పరిధిలో 117 చేయూత పెన్షన్లు మంజూరయ్యాయని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా చూస్తామని చెప్పారు. ప్రభుత్వం పెన్షన్ డబ్బులను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే జమ చేస్తుందని, లబ్ధిదారులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు చేయూత పెన్షన్ ఎంతో ఆసరాగా ఉంటుందని, అర్హులైన వారు ఎవరైనా మిగిలి ఉంటే గ్రామపంచాయతీని సంప్రదించాలని సర్పంచ్ కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భాస్కర్ గౌడ్, వార్డ్ మెంబర్ లైన్ రమేష్, నితిన్, మల్లేష్ యాదవ్, కుంటుక అశోక్ అధికారులు ఎంపీడీవో రాజేశ్వర్, వార్డ్ మెంబర్లు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## చందంపేట మండలంలో నూతన చేయూత పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్.



**దేవరకొండ డివిజన్**
**నవంబర్ 18 (మహా ప్రభ)**
చందంపేట మండలంలో గత పది సంవత్సరాల నుంచి కొత్త పింఛన్లు లేక ఇబ్బంది పడినటువంటి అర్హులైన పేదవారందరికీ తెలంగాణ రాష్ట్రముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోదేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలునాయక్ ఆధ్వర్యంలో బుధవారం చందంపేట మండలంలో పోలేపల్లిలో ధనలక్ష్మి హాల్లో 464 నూతన పింఛన్ల మంజూరు పత్రాలను అందజేశారుఈ కార్యక్రమంలో చందంపేట మాజీ ఎంపీపీ ఏడుపుల గోవిందు.చందంపేట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్లారెడ్డి మండల స్థాయి అధికారులు మండల సర్పంచ్లు వారితోపాటు కంబాలపల్లి ఉపసర్పంచ్ చిమట ముత్తయ్య యాదవ్ మరియు లబ్ధిదారులు మరియు తదితరులు ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నిరుపేదలకు చేయూత కొత్త పింఛన్లతో ఆర్థిక భరోసా.

**-ఎమ్మెల్యే బాలునాయక్.**



**దేవరకొండ డివిజన్ నవంబర్ 18 (మహాప్రభ)**
గుడిపల్లి మండలంలో 223 మందికి,పీఏపల్లి మండలంలో 433మందికికొత్తపింఛన్లు మంజూరు. లబ్ధిదారులకు బుధవారం మంజూరు పత్రాలు అందజేసి న దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్.రూ.15 కోట్లతో గుడిపల్లి, కొండమల్లేపల్లి, నేరేడుగమ్ము మండలాల్లో ఇంటిగ్రేటెడ మండలకార్యాలయాల నిర్మాణం.కొండమల్లేపల్లిలో వాహనాలరిజిస్ట్రేషన్ కార్యాలయం ఏర్పాటు
నిరుపేదలు, వితంతువులు, ఒంటరిమహిళలు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంతరెడ్డినాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలనుఅమలుచేస్తోందని దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్అన్నారు.
గుడిపల్లి మండలంలో 223 మంది,పీఏపల్లి మండలంలో 433 మంది లబ్ధిదారులకు మంజూరైన కొత్త చేయూత పింఛన్ల పత్రాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి నెలా అందించే పింఛన్ సొమ్ముపేదలకు నిత్యావసరాలు, వైద్య ఖర్చులకు ఎంతో ఉపయోగపడుతుందని, ఆత్మగౌరవంతోజీవించేందుకు అండగా నిలుస్తుందని తెలిపారు.
**మహిళా సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రాధాన్యత**
మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డులు, రైతులకు క్వింటాకు రూ.500 బోనస్ వంటి పథకాలతో ప్రభుత్వం పేద కుటుంబాలకు అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే వివరించారు.
**దేవరకొండకు ఆర్డీఓ కార్యాలయం తీసుకొచ్చిన ఘనత కాంగ్రెసప్రభుత్వానిదే**
గతంలో ఆర్డీఓకార్యాలయం మిర్యాలగూడలోఉండేదని, తాను తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని దేవరకొండకు ఆర్డీఓ కార్యాలయాన్ని తీసుకొచ్చానని ఎమ్మెల్యే గుర్తుచేశారు. ప్రజలకు పాలనను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో గుడిపల్లి, కొండమల్లేపల్లి, నేరేడుగొమ్ము మండలాల్లో సుమారు రూ.15 కోట్లతో ఇంటిగ్రేటెడ మండలకార్యాలయ సముదాయాల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు.కొండమల్లేపల్లిలోనే వాహనాల రిజిస్ట్రేషన్ కార్యాలయంగతంలో కొత్త వాహనం కొనుగోలు చేసినా రిజిస్ట్రేషనుకోసంమిర్యాలగూడకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని, ప్రజల ప్రయాణ భారాన్ని తగ్గించేందుకు కొండమల్లేపల్లి మండల కేంద్రంలోనే వాహనాల రిజిస్ట్రేషన్ కార్యాలయం ఏర్పాటుచేయబోతున్నామని వెల్లడించారు. దీంతో ప్రజలకు సమయం,ఖర్చు ఆదాఅవుతాయని ,పేర్కొన్నారు. దేవరకొండనియోజకవర్గంలో సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమానప్రాధాన్యత ఇస్తూ, ప్రతి గ్రామానికి అవసరమైన మౌలికసదుపాయాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే బాలునాయక్ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమాల్లో అధికారులు,మండల అధ్యక్షులు నెర్మటి సతీష్ రెడ్డి, మావిల్ల లక్ష్మి నారాయణ, ఏవి రెడ్డి, ముచ్చర్ల శ్రీకాంత్ యాదవ్, వంగాలప్రతాపరెడ్డి,వీరబోయిన ఎల్లయ్య యాదవ్, కసిరెడ్డిశ్రీనివాస్ రెడ్డి మద్దిమడుగు రామస్వామి, తేరాసత్యం రెడ్డి,మండలాల సర్పంచులు,ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు లబ్ధిదారులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

## రాంరెడ్డిపల్లి గ్రామంలో కొత్త పింఛన్లు పంపిణీ చేసిన సర్పంచ్ లపంగి నరసింహ.



దేవరకొండ డివిజన్ నవంబర్ 18 (మహాప్రభ)
మర్రిగూడ మండల పరిధిలో నీ రామ్ రెడ్డి పల్లి గ్రామంలో బుధవారం మునుగోడు ఎమ్మెల్యేకోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిక్యాంపు కార్యాలయంలో రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందినలబ్ధిదారులకు చేయూత పింఛన్లను గ్రామ సర్పంచ్ లపంగి నర్సింహా గారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని, పేదలు, వృద్ధులు, వికలాంగులకు చేయూత పింఛన్లు ఎంతో భరోసానిస్తాయనితెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మున్నయ్య, సెక్రెటరీ నాజీరా,నాంపల్లి బ్లాక్ కాంగ్రెస్అధ్యక్షులువెన్నమనేని రవీందర్ రావు, కాంగ్రెస్ మండల సెక్రటరీ రావుల రాములు,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నక్క శ్రీనివాస్,రాంరెడ్డిపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు కారింగు నర్సింహ, వార్డు సభ్యులు పగిళ్ల యాదమ్మ, పగిళ్ల శంకర్, లపంగి మహేందర్, వలపుహైమాభాస్కర్,తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్య సమస్యలతో వృద్ధుడి మృతి



పెద్దవంగర, నవంబర్ 18 మహాప్రభ
పెద్దవంగర మండలం పిచ్చిభోజ్య తండాకు చెందిన భూక్యా బాలు (75) అనే వృద్ధుడు గత ఐదేళ్లుగా తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతున్నాడు. పలుమార్లు చికిత్స చేయించుకున్నా నొప్పి తగ్గకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో మంగళవారం ఇంటి వెనుక ఉన్న చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందాడు. మృతుడి కుమారుడు భూక్యా రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెద్దవంగర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### చేయూత పింఛన్ లబ్ధిదారులకు
## ప్రొసీడింగ్స్ అందజేత

**నాలుగో వార్డులో లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాల పంపిణీ**



తూప్రాన్, నవంబర్ 18,(మహాప్రభ)
తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో వార్డుకు చెందిన చేయూత పింఛన్ లబ్ధిదారులకు మున్సిపల్ కార్యాలయంలో ప్రొసీడింగ్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బొంది రజిని రవీందర్ గౌడ్, నాలుగో వార్డు కౌన్సిలర్ రాథోడ్ జైపాల్ నాయక్, మున్సిపల్ కమిషనర్ రమేష్ పాల్గొని లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు.
ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు చలమేల రాములు, రాధాకుమారి, శ్రీనివాస్ స్వామి, వార్డు ఆఫీసర్ మహేష్‌తో పాటు పలువురు పింఛన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

## నూతన పెన్షన్ మంజూరు పత్రాలను అందజేసిన గ్రామ సర్పంచ్...




శివంపేట, నవంబర్ 18 (మహాప్రభ ):
శివ్వంపేట గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నూతనంగా మంజూరు అయినా కొత్త పెన్షన్ మంజూరు పత్రాలను గ్రామ సర్పంచ్ రాజీపేట వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో అందించడం జరిగింది.ఈ కార్యక్రమం లో పంచాయతీ కార్యదర్శి రమాదేవి వార్డు సభ్యులు 1వ వార్డు సభ్యులు ముయ్యడి ముత్యాలు,2వ వార్డు సభ్యులు ఈసారపు ప్రభావతి- రాజుగౌడ్, 3వ వార్డు సభ్యులు పెద్దగోని శ్రీనివాస్ గౌడ్ ,6వ వార్డు సభ్యులు దేవునబోయిన బాలమణి -క్రిష్ణ 7వ వార్డు సభ్యులు కోలా కిషన్,9వ వార్డు సభ్యులు కంలయ్యగారి మల్లేశ్వరి- నర్సింలు 10వ వార్డు సభ్యులు కొడకంచి స్వాతి- గణేష్ గౌడ్ 11వ వార్డు సభ్యులు రెడ్డిపల్లి స్వరూప అశోక్,12వ వార్డు సభ్యులు పెద్దకొల విక్రమ్ మరియు బి ఆర్ఎస్ సీనియర్ నాయకులు బాసంపల్లి రామగౌడ్ మాజీ వార్డు సభ్యులు వంజరి కొండల్, కోవూరి వెంకటేష్ , కమలయ్య గారి లక్ష్మి నారాయణ గ్రామస్థులు ముద్దగల దుర్గేష్, చింతకింది బిక్షపతి పాల్గొన్నారు..

# గోమారంలో రైతు సహకార సంఘానికి ఎమ్మెల్యే సహకారం...

**రైతును ఆదుకున్న ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వం...**



శివ్వంపేట, నవంబర్ 18 ( మహాప్రభ ) :
మెదక్ జిల్లా శివ్వంపేట మండలం గోమారం గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) తిరిగి ప్రారంభం కావడం వెనుక స్థానిక ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి నిరంతర కృషి, పట్టుదలే కారణమని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రమణ గౌడ్ స్పష్టం చేశారు. రైతుల కోసం ఎమ్మెల్యే చేసిన కృషిని కాదని, తమ నాయకుల వల్లే సంఘం పునరుద్ధరణ జరిగిందని కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఈ సందర్భంగా రమణ గౌడ్ మాట్లాడుతూ, శివ్వంపేట మండలంలో కేవలం ఒకే ఒక పీఏసీఎస్ ఉండటం వల్ల గోమారం పరిసర గ్రామాల రైతులు ఏళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.పంట రుణాల కోసం, ఎరువులు, విత్తనాల కోసం రైతులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని, చాలా మంది ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడిందని చెప్పారు.ఈ సమస్యను ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారని, గోమారంలో తిరిగి పీఏసీఎస్ ఏర్పాటు చేయాలని పలుమార్లు డిమాండ్ చేశారని రమణ గౌడ్ తెలిపారు. ఆమె నిరంతర ఒత్తిడి,డిమాండ్ మేరకే రాష్ట్ర ప్రభుత్వం గోమారంలో పీఏసీఎస్‌ను తిరిగి ప్రారంభించేందుకు ముందుకు వచ్చిందని ఆయన పేర్కొన్నారు. రైతుల చిరకాల కోరికను ఎమ్మెల్యే నెరవేర్చారని అన్నారు. అయితే సంఘం పునరుద్ధరణ జరిగిన వెంటనే కాంగ్రెస్ నాయకులు తమ నాయకుల కృషి వల్లే ఇది సాధ్యమైందని చెప్పుకుంటూ క్రెడిట్ కోసం పాకులాడుతున్నారని రమణ గౌడ్ ఆరోపించారు. వాస్తవాలు ప్రజలకు, రైతులకు తెలుసని, పునరుద్ధరణ కోసం ఎవరు కృషి చేశారో గోమారం పరిసర గ్రామాల ప్రజలు ప్రత్యక్షంగా చూశారని అన్నారు. ఇలాంటి రాజకీయ ప్రచారాలు రైతులను మోసం చేయడమే అవుతుందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ తీరుపై రమణ గౌడ్ మండిపడ్డారు. తాను ప్రజా ముఖ్యమంత్రినని చెప్పుకునే ముఖ్యమంత్రి ప్రజా సమస్యలను గాలికి వదిలేసి తిరగడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. రైతుల సమస్యలు, వ్యవసాయ రంగ సమస్యలపై ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతుల సమస్యలపై దృష్టి సారించి, పీఏసీఎస్‌లను బలోపేతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆకుల కొమురయ్య, ఉప సర్పంచ్ గుమ్ముల శ్రీలత శ్రీనివాస్, మాజీ సర్పంచ్ బోళ్ల భారతీ బిక్షపతి, మాజీ ఉపసర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, నాయకులు శ్రీశైలం యాదవ్, రాజేంద్ర నాయక్, రాజశేఖర్ గౌడ్, బోళ్ల ఆంజనేయులు, రామచంద్రం గౌడ్,యుద్ధం రెడ్డి,తదితరులు ఉన్నారు.

# దేవరకద్ర నియోజకవర్గంలో 4,867 మందికి చేయూత పింఛన్లు





**-అర్హులైన వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులకు మంజూరు పత్రాల పంపిణీ..**

**- ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం: ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి**

మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం నవంబర్ 18 మహాప్రభ
దేవరకద్ర: అర్హులైన పేదలకు అండగా నిలవడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జీఎంఆర్) అన్నారు. నియోజకవర్గ పరిధిలోని 4,867 మంది వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులకు నూతనంగా చేయూత పింఛన్లు మంజూరు చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలోని శ్రీనివాస గార్డెన్స్‌లో బుధవారం నిర్వహించిన నూతన చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా భూత్పూర్, అడ్డాకుల, మూసాపేట, చిన్నచింతకుంట, కౌకుంట్ల, దేవరకద్ర, మదనాపురం, కొత్తకోట మండలాలతో పాటు దేవరకద్ర, భూత్పూర్, కొత్తకోట మున్సిపాలిటీల పరిధిలోని మొత్తం 4,867 మంది అర్హులకు పింఛన్లు మంజూరైనట్లు వెల్లడించారు.అర్హుల నిరీక్షణకు తెర.. ఇచ్చిన హామీకి కార్యరూపం అనంతరం ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగుల నిరీక్షణకు నేడు తెరపడిందన్నారు. ఎన్నికల సమయంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పింఛన్లు మంజూరు చేయిస్తామని ఇచ్చిన హామీ మేరకు 4,867 మందికి నూతనంగా పింఛన్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. గతంలో పింఛన్ల కోసం అర్హులు ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తించిన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం, వారి జీవితాల్లో ఆర్థిక భరోసా నింపాలనే సంకల్పంతో ఈ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ, ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తోందని వివరించారు. భర్తను కోల్పోయి కుటుంబ బాధ్యతలను మోస్తున్న వితంతు మహిళలకు, కుటుంబానికి తామే ఆధారంగా జీవిస్తున్న ఒంటరి మహిళలకు, శారీరక వైకల్యంతో ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటున్న దివ్యాంగులకు చేయూత పింఛన్లు ఎంతో అండగా నిలుస్తాయని అన్నారు. ప్రతి నెలా అందే ఆర్థిక సహాయం వారి రోజువారీ అవసరాలకు తోడ్పడటమే కాకుండా, ఆత్మగౌరవంతో జీవించేందుకు భరోసా కల్పిస్తుందని పేర్కొన్నారు.నూతనంగా పింఛన్లు మంజూరైన ప్రతి ఒక్కరికీ ఎమ్మెల్యే జీఎంఆర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.
అర్హులెవరూ ఆందోళన చెందొద్దు టెక్నికల్ కారణాలతో అర్హులైన కొందరికి పింఛన్లు మంజూరు కాకపోయినా, వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. పింఛన్లు నిలిచిపోయిన వారు సంబంధిత ధ్రువపత్రాలతో తిరిగి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్ అందేలా చర్యలు తీసుకునే బాధ్యత తనదేనని భరోసా ఇచ్చారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలందరూ అండగా నిలిచి ఆశీర్వదించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ కోరారు.

**11వ వార్డులో 27 మందికి చేయూత పింఛన్లు**

దేవరకద్ర మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డులో అత్యధికంగా 27 మంది అర్హులైన లబ్ధిదారులకు చేయూత పింఛన్లు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ కొండా ధామయంతి, వైస్ చైర్మన్ యుగేందర్ రెడ్డి, 11వ వార్డు కౌన్సిలర్ వడే రాధా కొండల్ లబ్ధిదారులకు పింఛన్ మంజూరు ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు.
వార్డులో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో కౌన్సిలర్ వడే రాధా కొండల్ నిరంతరం కృషి చేస్తున్నారని స్థానికులు అభినందనలు వ్యక్తం చేస్తున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, సంక్షేమ పథకాల అమలుకు చొరవ చూపుతున్న ప్రజాప్రతినిధుల కృషిపై వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.
పేదలకు ఆర్థిక భరోసా.. అర్హులకు సంక్షేమ ఫలాలు.. ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమం కొనసాగింది.

# చేయూత పింఛన్ల మంజూరులో ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి చొరవ..

**-లబ్ధిదారులకు పత్రాలు అందజేసిన జీనుగురాల సర్పంచ్ నాగమ్మ సాయిలు**

**-పేదల సంక్షేమమే లక్ష్యంగా ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ప్రత్యేక కృషి**

**-- లబ్ధిదారులకు అండగా నిలిచిన సర్పంచ్ నాగమ్మ సాయిలు**







మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం నవంబర్ 18 మహాప్రభ
దేవరకద్ర: అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే లక్ష్యంగా దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ( జిఎంఆర్ ) ప్రత్యేక చొరవ చూపుతున్నారు. ఆయన ఆదేశాల మేరకు దేవరకద్ర నియోజకవర్గంలోని మండల కేంద్రంలో బుధవారం శ్రీనివాస గార్డెన్స్‌లో నిర్వహించిన చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో జీనుగురాల గ్రామానికి చెందిన లబ్ధిదారులకు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జీనుగురాల గ్రామ సర్పంచ్ కె. నాగమ్మ సాయిలు తన చేతుల మీదుగా గ్రామానికి చెందిన అర్హులైన లబ్ధిదారులకు చేయూత పింఛన్ల మంజూరు పత్రాలను అందజేశారు. ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి తీసుకుంటున్న చొరవతో అర్హులకు ప్రభుత్వ పథకాలు చేరువవుతున్నాయని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు.అదేవిధంగా జీనుగురాల గ్రామానికి చెందిన కుమ్మరి వసంత (భర్త సాయిలు)కు రూ.2,50,000 విలువైన ఎల్ఓసీ (గ్రూజ)ని అందజేశారు. అవసరమైన వారికి ఆర్థిక భరోసా కల్పించడంలో ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి చూపుతున్న చొరవ పట్ల లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామ ప్రజల సంక్షేమం, అర్హులైన వారికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చూడటంలో సర్పంచ్ నాగమ్మ సాయిలు చురుకైన పాత్ర పోషిస్తున్నారు. ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి సహకారంతో గ్రామానికి మరిన్ని సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తామని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జీనుగురాల గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యాదగిరి రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు జనార్దన్ గౌడ్, రాజేశ్వర్ రెడ్డి, సి. రాఘవేంద్ర, పంచాయతీ కార్యదర్శి ఇన్‌చార్జి రాఘవేంద్ర, సంబంధిత లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అండగా శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్.

**-చదువుకో తెలంగాణ'పోస్టర్ ఆవిష్కరణ.**

**-అదనపు కలెక్టర్ నగేష్.**



**మెదక్ జిల్లా -18నవంబర్ (మహాప్రభ ).**
ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ చేపట్టిన 'చదువుకో తెలంగాణ' కార్యక్రమంను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ చదువుకో తెలంగాణ'పోస్టర్ అదనపు కలెక్టర్ నగేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ
గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు వివరించారు.శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'చదువుకో తెలంగాణ' కార్యక్రమంలో ఈ పథకం కింద నియోజకవర్గ స్థాయి టాపర్‌కు రూ.1 లక్ష, జిల్లా స్థాయి టాపర్‌కు రూ.2 లక్షలు, రాష్ట్ర స్థాయి మొదటి టాపర్‌కు రూ.5 లక్షలు, రెండో టాపర్‌కు రూ.3 లక్షల నగదు పురస్కారాలు అందజేస్తున్నట్లు వెల్లడించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదివి మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులకు, చదువుకున్న పాఠశాలకు పేరు తీసుకురావాలని, భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో శ్రీరామ్ బ్రాంచ్ మేనేజర్ రత్నాకర్, వి రాజేంద్రప్రసాద్, కృష్ణ ,శ్రీకాంత్ రవికుమార్, గుండు రమేష్ నిరంజన్ ఆకుల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు

## పెద్దవంగరలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం దరఖాస్తుల స్వీకరణ

**నవంబర్ 20 నుంచి డిసెంబర్ 19 వరకు గ్రామపంచాయతీల్లో ఆన్‌లైన్ దరఖాస్తులు**



**పెద్దవంగర:**
**నవంబర్ 18 (మహాప్రభ)**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ఈ నెల 19న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో నవంబర్ 20 నుంచి డిసెంబర్ 19వ తేదీ వరకు పెద్దవంగర మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పెద్దవంగర తహసీల్దార్ తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఈ పథకానికి 18 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు అర్హులని, రేషన్ కార్డు ఉన్నవారితో పాటు రేషన్ కార్డు లేని వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ నిర్ణీత గడువులోగా తమ గ్రామపంచాయతీల్లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కావున పెద్దవంగర మండల ప్రజలందరూ ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కోరారు.

**తూప్రాన్ పట్టణంలోని గర్ల్స్ హైస్కూల్‌లో విద్యార్థినుల కోసం**
**సెల్ఫ్ డిఫెన్స్ (ఆత్మరక్షణ)పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.**



**తూప్రాన్ నవంబర్ 18,(మహాప్రభ)**
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్,హాజరై విద్యార్థినులకు ఆత్మరక్షణ యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ, ప్రతి విద్యార్థిని ఆత్మవిశ్వాసంతో, ధైర్యంగా ఉండాలని సూచించారు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా భయపడకుండా, అప్రమత్తంగా వ్యవహరించాలని, తమకు ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని తెలిపారు. వ్యక్తిగత భద్రత పట్ల అవగాహన కలిగి ఉండటంతో పాటు, ఆపద సమయంలో సమయస్ఫూర్తితో నిర్ణయాలు తీసుకోవడం ఎంతో ముఖ్యమని వివరించారు. అదేవిధంగా విద్యార్థినులు తమలోని ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకొని, ఇతరులపై ఆధారపడకుండా తమను తాము రక్షించుకునే సామర్థ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ ఎంఈఓ సత్యనారాయణ ,ఎస్ఐ జ్యోతి, షీ టీమ్ సభ్యురాలు స్వరూప, పోలీసు సిబ్బంది మరియు పాఠశాల అధ్యాపకురాలు పాల్గొన్నారు. అనంతరం కరాటే శిక్షకులు భిక్షపతి మరియు నైనీష విద్యార్థినులకు ఆత్మరక్షణకు సంబంధించిన వివిధ పద్ధతులపై ప్రాక్టికల్ డెమో ప్రదర్శించి, ఆపద సమయాల్లో వాటిని ఎలా ఉపయోగించుకోవాలో వివరించారు.

# ప్రతి అర్హుడికి ప్రభుత్వ పథకం అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వం ధ్యేయం!!

**-ఇందిరమ్మ బీమా పథకంతో ప్రతి కుటుంబానికి లబ్ధి!!**

**-పింఛన్లు, రేషన్ కార్డులు, సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి..!!**

**వనపర్తి నవంబర్ 18 మహా ప్రభ**
అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించి వారి జీవితాల్లో ఆర్థిక భరోసా కల్పించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. బుధవారం ఖిల్లా ఘణపురం మండల కేంద్రంలోని పద్మశాలి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నూతన చేయూత పింఛన్ల మంజూరు ధ్రువీకరణ పత్రాలు, డిజిటల్ రేషన్ కార్డులు, సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వనపర్తి నియోజకవర్గంలో ప్రతి నెల రూ.11 కోట్ల పింఛన్లు పంపిణీ చేస్తూ వేలాది పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు గత ప్రభుత్వాల హయాంలో అమలైన ప్రజలకు ఉపయోగపడే పథకాలను కొనసాగిస్తూనే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఆరు గ్యారంటీలను దశలవారీగా అమలు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంపై గత పాలకులు లక్షల కోట్ల అప్పుల భారం మోపినప్పటికీ పేదల సంక్షేమానికి ప్రభుత్వం వెనుకడుగు వేయడం లేదన్నారు. నాటి ఎన్టీ రామారావు కాలం నుంచి నేటి రేవంత్ రెడ్డి కాలం వరకు గత ప్రభుత్వాలు చేసిన సంక్షేమ పథకాలను అమలు చేస్తూనే కొత్తగా మరో 20 పథకాలను తెలంగాణ రాష్ట్రంలోని నిరుపేదలకు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని ఎమ్మెల్యే పేర్కొన్నారు రైతు భరోసా, రుణమాఫీ, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పింఛన్లు,



సన్నబియ్యం పంపిణీ వంటి కార్యక్రమాలతో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తున్నామని వివరించారు. ఇందిరా బీమా పథకం ద్వారా నేడు ప్రతి కుటుంబాన్ని ఆదుకునేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ నూతనంగా ఇందిరా బీమా పథకానికి చుట్టూందన్నారు కుటుంబంలో సంపాదించే వ్యక్తి అనుకోకుండా మరణిస్తే ఆ కుటుంబం ఆర్థికంగా కుంగిపోకుండా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా రూ.5 లక్షల బీమా రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే తెలిపారు నవంబర్ 19 నుంచి ఈ పథకం ప్రారంభం కానుందని పేర్కొన్నారు. వనపర్తి నియోజకవర్గానికి ఇప్పటికే 5,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయించామని, ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించి గుడిసెలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన సంకల్పమని అన్నారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, వ్యాపార అవకాశాలు కల్పిస్తూ మహిళలను ఆర్థికంగా స్వావలంబులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఆర్టీసీ బస్సుల నిర్వహణ, సోలార్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు వంటి రంగాల్లో మహిళలకు అవకాశాలు కల్పిస్తోందన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు నీటిని, విద్యుత్‌ను వృథా చేయకుండా పొదుపుగా వినియోగించుకోవాలని కోరారు. కరువు పరిస్థితులు వచ్చినా రైతులు, ప్రజలను ఆదుకునేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ వచ్చిన తర్వాత టీఆర్ఎస్ పార్టీ నాయకులకు కరువు వచ్చిందని, ఎక్కడ కూడా అవినీతి సొమ్ము సంపాదించుకునేందుకు అవకాశం లేకుండా పోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కరువు వచ్చిందని వారి అక్కస్సును వెలగకుతున్నారన్నారు కార్యక్రమంలో వనపర్తి కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు సాయిచరణ్ రెడ్డి, ఖిల్లా ఘణపురం మార్కెట్ యార్డ్ అధ్యక్షురాలు నవనీత క్యామ రాజు, ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ పద్మమ్మ, మండల అధ్యక్షులు కృష్ణయ్య యాదవ్, జిల్లా యూత్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, సింగిల్ విండో అధ్యక్షులు మురళీధర్ రెడ్డి, రవి నాయక్, వెంకట్రావు, మురళీధర్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నవీన్ రెడ్డి, ఆగారం ప్రకాష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## ఫ్యూచర్‌జెన్ టెక్నాలజీస్ ద్వారా ఎల్లంకి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ సివిల్ ఇంజినీరింగ్ కళాశాలలో లో సెమినార్...

**పటాన్ చెరువు, నవంబర్ 18 (మహా ప్రభ)**
పటాన్చెరు మండలంలోని పటేల్ కూడా లోగల ఎల్లంకి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజ్ లో ఫ్యూచర్‌జెన్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో సివిల్ ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు బిల్డింగ్ ఇన్ఫర్మేషన్ మోడలింగ్ లో బుధవారం రోజు సెమినార్ నిర్వహించబడినది. ఈ సందర్భంగా బిల్డింగ్ ఇన్ఫర్మేషన్ మోడలింగ్ లో సెమినార్ నిర్వహించినందుకు ఎల్లంకి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ జాన్ పాల్ మాట్లాడుతూ ఫ్యూచర్ జెన్ టెక్నాలజీ కు ధన్యవాదాలు తెలియజేశారు. సివిల్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్. విభాగాధిపతి డా.ముద్రగడ అనిత మాట్లాడుతూ ఫ్యూచర్‌జెన్ టెక్నాలజీస్ కు ధన్యవాదాలు తెలియజేశారు. విద్యార్థినీ విద్యార్థులు ఇలాంటి సెమినార్ల ద్వారా తమ నాలెడ్జ్ ను పెంచుకొని జీవితంలో స్థిరపడాలని కోరుకున్నారు , ఈ సెమినార్ ప్రధాన భావనలు, వాస్తవ పరిశ్రమ ధోరణులు మరియు భవిష్యత్తు సవాళ్లను అనుసంధానిస్తుంది అని చెప్పారు. డాక్టర్ మహమ్మద్



నజీరున్నిసా మేనేజింగ్ డైరెక్టర్ ఫ్యూచర్‌జెన్ టెక్నాలజీస్ మాట్లాడుతూ ఆర్కిటెక్ట్‌లు, స్ట్రక్చరల్ మరియు సివిల్ ఇంజనీర్లు, నిపుణులు మరియు కాంట్రాక్టర్‌లను ఒక ఏకీకృత కామన్ డేటా ఎన్విరాన్‌మెంట్‌లో అనుసంధానిస్తుంది అని అన్నారు.
ఫ్యూచర్‌జెన్ టెక్నాలజీస్ కార్పొరేట్ కమ్యూనికేషన్స్ మేనేజర్ మోహన్ దాస్ మాట్లాడుతూ నివాస మరియు వాణిజ్య డెవలపర్‌ల కోసం ఉత్తమ నిర్మాణ నిర్వహణ సాఫ్ట్‌వేర్ కోర్సులను నేర్చుకొని జీవితంలో స్థిరపడాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో షేక్ మొహమ్మద్ నోమన్, బిమ్ బిల్డింగ్ ఇన్ఫర్మేషన్ మోడలింగ్ ఎక్స్‌పర్ట్ కమ్ ట్రైనర్,ఫ్యూచర్‌జెన్ టెక్నాలజీస్ మాట్లాడుతూ బిల్డింగ్ ఇన్ఫర్మేషన్ మోడలింగ్ అనేది ఒక తెలివైన, 3ఇ మోడల్ ఆధారిత ప్రక్రియ. ఇది ఆర్కిటెక్చర్, ఇంజనీరింగ్ మరియు నిర్మాణ రంగ నిపుణులకు భవనాలు మరియు మౌలిక సదుపాయాలను మరింత సమర్థవంతంగా ప్రణాళిక చేయడానికి, రూపకల్పన చేయడానికి, నిర్మించడానికి మరియు నిర్వహించడానికి అవసరమైన సాధనాలను, అవగాహనను అందిస్తుంది అని తెలియజేశారు.కార్యక్రమంలో ఎల్లంకి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజ్, ఫ్యూచర్‌జెన్ టెక్నాలజీస్ అధ్యాపకులు శ్రీ శ్రీనివాస్, శ్రీ అమానుల్లా, శ్రీమతి పి.సుష్మిత, డా.కె.సమ్మయ్య సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి వితంతు మహిళకు చేయూత అందించడమే లక్ష్యం



**ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి సహకారంతో వెంకటాయపల్లిలో**
**పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ**
**-- సర్పంచ్ సక్కెరి రామాంజనేయులు దేవరకద్ర**

**మహాప్రభ**
**దేవరకద్ర నవంబర్ 18 మహాప్రభ**
దేవరకద్ర: అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని వెంకటాయపల్లి గ్రామ సర్పంచ్ సక్కెరి రామాంజనేయులు అన్నారు. దేవరకద్ర నియోజకవర్గ శాసనసభ్యులు జి. మధుసూదన్ రెడ్డి ప్రత్యేక చొరవ, సహకారంతో వెంకటాయపల్లి గ్రామానికి చెందిన అర్హులైన వితంతు మహిళలకు చేయూత పింఛన్లు మంజూరు కావడంతో గ్రామంలో లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, వెంకటాయపల్లి గ్రామ సర్పంచ్ సక్కెరి రామాంజనేయులు చేతుల మీదుగా లబ్ధిదారులకు పింఛన్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలోని అర్హులైన వితంతు మహిళలకు ఆర్థిక భరోసా కల్పించేలా పింఛన్లు మంజూరు కావడం సంతోషకరమని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించేందుకు ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి నిరంతరం సహకరిస్తున్నారని కొనియాడారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా.. గ్రామంలోని ప్రతి అర్హులైన లబ్ధిదారుడికి ప్రభుత్వ పథకాలు అందేలా తన వంతు కృషి కొనసాగిస్తానని సర్పంచ్ సక్కెరి రామాంజనేయులు స్పష్టం చేశారు. చేయూత పింఛన్ల మంజూరుకు సహకరించిన ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డికి గ్రామ ప్రజలు, లబ్ధిదారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి రాంమోహన్ గౌడ్, ఉప సర్పంచ్ పింజరి మోహన్, వార్డు సభ్యురాలు చంద్రకళ, కరోబార్ సాగర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నరేష్, నాగార్జున, కిషోర్, సంకటి ఎర్ర మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



# విమర్శలను మోటివేషన్‌గా మార్చుకుంటున్నా: దుల్కర్ సల్మాన్!



ప్రముఖ నటుడు దుల్కర్ సల్మాన్ ఆన్‌లైన్ నెగెటివిటీ, విమర్శలను ఎదుర్కొనే విధానంపై మరియు అవి తన కెరీర్ ఎంపికలపై ఎలాంటి ప్రభావం చూపుతున్నాయనే దానిపై తాజాగా స్పందించారు. ఆయన మాట్లాడుతూ.. గతంలో తనను తీవ్రంగా కుంగదీసిన విమర్శలు ఇప్పుడు తనకు సులభంగా ఎదుర్కొనేలా మారాయని తెలిపారు.తన ఉద్దేశం ఎప్పుడూ మంచి సినిమాలు చేయడమేనని, ఎంత కష్టపడినా కొద్దిపాటి నెగెటివిటీ రావడం సహజమని ఆయన గ్రహించారు. అయితే, ఆ నెగెటివిటీని తానెప్పుడూ కక్షగా లేదా అసూయగా మార్చుకోలేదని, దాన్ని ఒక మోటివేషన్‌గా తీసుకుని తనని తాను నిరూపించుకోవడానికి ప్రయత్నిస్తానని దుల్కర్ వెల్లడించారు. "కొంతమంది నేను ఒక పాత్ర చేయలేనని భావిస్తే, నేను దాన్ని సవాల్‌గా తీసుకుని చేయడానికి ప్రయత్నిస్తాను. భయపెట్టే లేదా సవాల్‌తో కూడిన పాత్రలను ఎంచుకోవడం వల్ల నటుడిగా నా ఎదుగుదల సాధ్యమైంది. ప్రస్తుతం నాలో ఎలాంటి కసి లేదా పగ లేదు" అని ఆయన భావోద్వేగంగా చెప్పుకొచ్చారు.
మరోవైపు, పవన్ సాధినేని దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్ నటిస్తున్న తెలుగు డ్రామా చిత్రం 'ఆకాశంలో ఒక తార' నవంబర్ 20, 2026న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇదే రోజున ఆయన తండ్రి, మలయాళ సూపర్ స్టార్ మమ్ముట్టి నటించిన 'ఓ.ఎం: ఆపరేషన్ మోల్' కూడా విడుదలవుతుండటంతో, బాక్సాఫీస్ వద్ద తండ్రీకొడుకుల సినిమాల మధ్య ఆసక్తికరమైన పోటీ నెలకొంది.




# అయ్యప్ప భక్తి నేపథ్యంలో వైభవ్ 'హరిహర పుత్ర'.. ఆకట్టుకుంటున్న టీజర్!




టాలెంటెడ్ హీరో వైభవ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'హరిహర పుత్ర'. బ్లాక్‌బస్టర్ సినిమా 'మాళిగాపురం' ఫేమ్ విష్ణు శశి శంకర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. స్వామి అయ్యప్ప భక్తి, ఆధ్యాత్మికత మరియు ఉత్కంఠభరితమైన రహస్యాల నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమా తెలుగు టీజర్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. ఈ చిత్రంలో వైభవ్ పూర్తి భక్తిభావంతో కూడిన అయ్యప్ప భక్తుడిగా నటిస్తుండగా, ఆయన సరసన మీనాక్షి గోవిందరాజన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. వీరితో పాటు ఆడుకాలం నరేన్, అరవింద్ ఆకాష్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు.ఈ చిత్రంలో రవి మోహన్, మిర్చి శివ, వెంకట్ ప్రభు, కృష్ణ, మహత్, ప్రేమ్‌జీ అమరన్ మరియు గంగై అమరన్ వంటి ప్రముఖులు ప్రత్యేక పాత్రల్లో నటిస్తున్నారు. తంత్రా ఫిలింస్ పతాకంపై జె.కె. శరవణ, ఎం. రాజారామ్ ఈ చిత్రాన్ని నిర్మించగా, ప్రముఖ దర్శకుడు వెంకట్ ప్రభు దీనికి క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమాకు ప్రేమ్‌జీ అమరన్ సంగీతం అందిస్తుండగా, ప్రవీణ్ కె.ఎల్. ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.



# తమిళంలోకి ఆనంద్ దేవరకొండ సినిమా

**-కోలీవుడ్‌పై దృష్టి పెట్టిన ఆనంద్ దేవరకొండ**
**-తమిళంలోకి అనువాదం కానున్న క్రైమ్ కామెడీ చిత్రం 'గం గం గణేశా'**
**-హీరోయిన్లుగా నటించిన నయన్ సారిక, ప్రగతి శ్రీవాస్తవ**

టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండ తమ్ముడు, యంగ్ హీరో ఆనంద్ దేవరకొండ కోలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఆయన తెలుగులో నటించిన క్రైమ్ కామెడీ చిత్రం 'గం గం గణేశా' ఇప్పుడు తమిళ ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాను తమిళంలో 'జై జై గణేశా' పేరుతో అనువదించి విడుదల చేస్తున్నారు. జేజే మూవీస్ పతాకంపై నిర్మాత విజయ్ మాధవన్ ఈ చిత్రాన్ని తమిళంలో రిలీజ్ చేస్తున్నారు. పూర్తిస్థాయి యాక్షన్, థ్రిల్లర్, కామెడీ అంశాలతో వినోదాత్మక చిత్రంగా దీనిని రూపొందించారు. ఈ సినిమాలో ఆనంద్ దేవరకొండ సరసన నయన్ సారిక, ప్రగతి శ్రీవాస్తవ హీరోయిన్లుగా నటించారు. ప్రతినాయకుడి పాత్రలో రాజ్ అరుణ్ నటించగా, దర్శకుడు ఉదయ్ బొమ్మిశెట్టి ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. వెన్నెల కిశోర్, సత్యం రాజేష్, జబర్దస్త్ ఇమ్మాన్యుయేల్ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు.తెలుగులో ఒక చిన్నపాటి దొంగ పాత్రలో ఆనంద్ దేవరకొండ నటన, వినోదం ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. విభిన్న కథలతో తెలుగులో తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్న ఆనంద్ దేవరకొండ, ఇప్పుడు 'జై జై గణేశా' ద్వారా కోలీవుడ్ ఆడియన్స్‌ను అలరించేందుకు సిద్ధమయ్యారు.

# 'రామాయణ' 13 రోజుల వసూళ్లు రూ.1,483 కోట్లు..



నితీశ్ తివారీ దర్శకత్వంలో రణ్‌బీర్ కపూర్, సాయి పల్లవి, యశ్ ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన పౌరాణిక చిత్రం 'రామాయణ' బాక్సాఫీస్ వద్ద రికార్డు వసూళ్లతో దూసుకుపోతోంది. ఈ సినిమా విడుదలైన 13 రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 1,483.50 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించిందని ప్రముఖ ట్రేడ్ ట్రాకర్ 'శాక్‌నిల్క్' వెల్లడించింది. ప్రస్తుతం ఈ చిత్రం రూ. 1,500 కోట్ల మైలురాయికి చేరువలో ఉంది. ట్రేడ్ వర్గాల నివేదికల ప్రకారం, 13వ రోజైన నవంబర్ 17న ఈ చిత్రం భారతదేశంలో రూ. 28.70 కోట్ల నెట్ వసూళ్లను రాబట్టింది. 12వ రోజు వసూలైన రూ. 32 కోట్లతో పోలిస్తే ఇది 10.3 శాతం తక్కువ. దీంతో ఇప్పటివరకు భారత్‌లో మొత్తం నెట్ వసూళ్లు రూ. 821.30 కోట్లకు, గ్రాస్ వసూళ్లు రూ. 981.50 కోట్లకు చేరాయి. ఇదే సమయంలో ఓవర్సీస్ మార్కెట్లలో రూ. 502 కోట్ల గ్రాస్ వసూళ్లు నమోదయ్యాయి. ఈ చిత్రం సాధించిన మొత్తం వసూళ్లలో విదేశీ మార్కెట్ వాటా సుమారు 33.8 శాతంగా ఉండటం గమనార్హం. దేశీయ వసూళ్లలో హిందీ వెర్షన్ కీలక పాత్ర పోషిస్తోంది. 13వ రోజున హిందీలో రూ. 21 కోట్లు వసూలు కాగా, మలయాళంలో రూ. 2.35 కోట్లు, కన్నడలో రూ. 2.10 కోట్లు, తమిళంలో రూ. 1.75 కోట్లు, తెలుగులో రూ. 1.50 కోట్ల చొప్పున వసూలయ్యాయి. నవంబర్ 5న విడుదలైన ఈ చిత్రం తొలి వారంలో (8 రోజుల్లో) భారత్‌లో రూ. 564.60 కోట్ల నెట్ కలెక్షన్లను సాధించింది. రెండో వారంలోని పని దినాల్లో (వీక్‌డేస్) వసూళ్లు కాస్త మందగించినప్పటికీ, ఓవర్సీస్‌లో మాత్రం తన జోరును కొనసాగిస్తోంది. ఇక ఐఎండీబీ పాపులారిటీ చార్ట్‌లోనూ ఈ సినిమా మూడో స్థానంలో నిలవడం విశేషం.

# ఎన్టీఆర్, అనిల్ రావిపూడి సినిమా టైటిల్ అదేనా?



తన తాత ఎన్టీఆర్ నటించిన ఆల్‌టైమ్ క్లాసిక్ 'లవకుశ' టైటిల్ కలిసొచ్చేలా 'జైలవకుశ' సినిమా చేసి బ్లాక్‌బస్టర్ అందుకున్నారు జూనియర్ ఎన్టీఆర్. ఇప్పుడు ఆ ఫీట్‌ని రిపీట్ చేస్తూ, మళ్లీ తాత ఎన్టీఆర్ టైటిల్ కలిసొచ్చేలా మరో సినిమా చేయనున్నారట తారక్. ఆల్‌టైమ్ క్లాసిక్ 'దానవీరశూరకర్ణ' టైటిల్ కలిసొచ్చేలా.. 'దానవీరశూర' పేరుతో తారక్ సినిమా చేయనున్నట్టు ఫిల్మ్ వర్గాల్లో ఓ వార్త బలంగా వినిపిస్తున్నది.ప్రస్తుతం ఎన్టీఆర్ 'డ్రాగన్' సినిమా చేస్తూ బిజీగా ఉన్న విషయం తెలిసిందే. ఈ సినిమా తర్వాత ఆయన అనిల్ రావిపూడి దర్శకత్వంలో సినిమా చేయనున్నట్లు ఇటీవలే ప్రకటించారు. ఆ సినిమాకే 'దానవీరశూర' టైటిల్ అనుకుంటున్నారట. అయితే.. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సివున్నది.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com